# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 37 సంచిక 5

పేజీలు 44

జనవరి 2018

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం ........................................4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 6

అమ్మమాట........................................ 9

వచ్చిందండీ సంక్రాంతి!

తెచ్చిందండీ ఆనంద హేల ..........11

గరుడ గర్వ భంగం ........................ ..................14

త్రిపురా రహస్యం ........................................ 17

శరణాగతుని బాధ్యత భగవంతునిదే ....19

గోదాదేవి ........................................20

పాత్ర నెరిగిన దానం ........................ ...............22

శివుని కథలు ........................................ ..24

మూలాజ్ఞానం ........................................25

యోగవాశిష్ఠము ........................................ 27

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు............................29

పరిప్రశ్న ........................................30

శ్రీకృష్ణకర్ణామృతము........................................33

గడ్డపార మింగితే ........................................34

సాల్ బేగ్ భగవద్భక్తి ........................................37

సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు- మీరాబాయి..............................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

**జాగ్రత్ స్వప్న సుషుప్త్యాది ప్రపంచం యత్ ప్రకాశయతే।**
**తద్ బ్రహ్మాహమితి జ్ఞాత్వా సర్వబంధైః ప్రముచ్యతే॥**

**(కైవల్యోపనిషత్ - 17వ శ్లో॥)**

బ్రహ్మసాక్షాత్కారము, లేక ఆత్మానుభూతిని పొందిన ఆత్మజ్ఞాని సర్వ బంధముల నుండి విముక్తుడు. అది యదార్థమే. అసలు బంధము అంటే ఏమిటి? బంధము అంటే దేహాన్ని ఏదైనా సంకెళ్ళతో కట్టి పడేయటం కాదు సుమా! బుద్ధిలోని ఆలోచనలు, మనస్సులోని విక్షేపాల వలన ఇంద్రియాలకు కలిగే విషయ లాలసత ద్వారా జీవునికి పరిమిత భావాలు కలుగుతాయి. ఆ పరిమిత భావనయే బంధము.

దీనిని గుర్తించినవారు బాహ్య ప్రపంచ ప్రభావమునకు ఎన్నడూ లోను కారు. బాహ్య ప్రపంచం ఎన్నడూ నిన్ను బాగుచేయడానికి గానీ, పాడుచేయడానికి గానీ అవకాశము లేదన్నమాట. బాహ్య ప్రపంచంతో తన బలహీనత వలన కల్పించుకున్న సంబంధమే బంధం అవుతోంది. సాధకుడు పరమాత్ముని యొక్క యదార్థ తత్వాన్ని గుర్తిస్తే బంధ విముక్తుడే. తానే ప్రాపంచిక విషయాదులపై ఆధిపత్యము కొనసాగించ గలుగుతాడు. ఇది మాత్రం యదార్థం. జీవుడు ప్రాపంచికంగా జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థలలోనూ అనుభవాలను పొందుతున్నాడు. అయితే ఆ పొందే అనుభవాలను ప్రకాశింపజేసే చైతన్యమే జ్ఞాన తత్త్వమని, ఆ చైతన్యమే తనకొక జీవభావాన్ని ఆపాదించుకుని విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడుగా భాసిస్తోంది.

సాధకుడు దేహమనోబుద్ధులను అధిగమించి, జీవభావాన్ని తొలగించుకుని, దాని వెనుక వున్నదానికి ఆధారమైన ఆత్మవస్తువుని గుర్తించగలగటమే బ్రహ్మానుభూతి. 'తత్ బ్రహ్మోఽహం' అంటే ఆ బ్రహ్మను నేనే అనే భావన అన్నమాట. అలాగని ఇది కేవలం భావ ప్రకటన కాదు సుమా. ఆ భావాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. అది సద్గురుమూర్తి సమాశ్రయం ద్వారానే సాధ్యపడుతుంది. ఆయన బోధా శ్రవణం ద్వారా బుద్ధిలోని వక్ర ఆలోచనలు, మనస్సులోని విక్షేపాలు తొలగి బంధ విముక్తుడు అవటం తథ్యం. పరిమితులు పెట్టుకుని జీవించటమే బంధన. పరిమితిని ప్రోత్సహించేది 'నేను', 'నాది' అనే సంకుచిత భావాలు అవస్థాత్రయమునకు లోనయ్యేది జీవత్వమే అన్న విషయాన్ని అవగాహన చేసుకుని, అవస్థలకు సాక్షిని నేనే అనే భావన అనుభవ పూర్వకంగా

గుర్తించ గలిగిన సాధకునికి బంధము లేదు. అయితే సాధకుడు మనస్సులో సంకల్పాలకు దాసుడై బద్ధుడై అశాంతికి గురి అవుతున్నాడు. అటువంటి అశాంతి నుంచి విముక్తుడవ్వాలంటే సద్గురుమూర్తి అనుగ్రహానికి పాత్రుడవ్వాలి. ఆయన దాని నివారణకు కీలకాన్ని ప్రబోధిస్తారు.

## పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు

జనవరి 2018

02 మంగళవారం - పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

11 గురువారం శ్రీ గురుదశమి, రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

14 ఆదివారం - భోగి -రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాదపూజ, భోగిపళ్ళు.

15 సోమవారం - మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

27 శనివారం భీష్మ ఏకాదశి. శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠ వార్షికోత్సవం, ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, ఏకాహం, సా॥ 6గం. హనుమాన్ చాలీసా పారాయణ.

28 ఆదివారం - ఉ॥ 8గం.లకు సూర్యదేవుని పూజ, సామూహిక కుంకుమ, శ్రీసద్గురు పాదపూజలు.

29 సోమవారం - రాత్రి 7గం.లకు తెప్పోత్సవం

31 బుధ : మాఘ పౌర్ణమి - ఉదయం 10గం. సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

ఫిబ్రవరి 2018

10 శనివారం - శ్రీ గురుదశమి - రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

13 మంగళవారం - మహాశివరాత్రి - ఉ. 5గం.లకు అభిషేకం; రాత్రి7గం. శ్రీసద్గురు పాదపూజ.

మార్చి 2018

02 శుక్రవారం - పౌర్ణిమ (హోలీ),రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

12 సోమవారం - శ్రీగురుదశమి; రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ.

18 ఆదివారం - శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది, ఉదయం 11 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

"ఒక ఉన్నత స్థానాన్ని అధిష్ఠించిన పీఠాధిపతిగానీ లేక ఏదైనా ఒక ఆశ్రమాన్ని నిర్వహించే ఆశ్రమాధిపతిగానీ దేశ రాజకీయాలలో జోక్యం కలుగజేసుకోవడం సమంజసంగా ఉంటుందా?" అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "సద్గురుమూర్తి సర్వశక్తిమంతుడు, సర్వేశ్వరుడు సర్వరక్షకుడు, సర్వాంతర్యామి అని నమ్మిన ఏ సాధకునికైనా నేను నమ్మిన గురుదేవుడే గొప్పవాడు. మిగిలిన వారంతా అసమర్థులు అనే భావన ఉద్భవించదే. అలా విమర్శించడం సాధకునికి తగదు. ఉదాహరణకు శ్రీ శంకర భగవత్పాదుల వారు దేశం నలుమూలలా వారి తపోశక్తిని ధారపోసి పీఠములను స్థాపించారు. వారు స్థాపించిన ఆ పీఠములను ఎవరు అధిష్ఠించినా మనం గౌరవించవల్సినదే కదా! అలా చేయకపోతే జగద్గురువైన శ్రీ శంకర భగవత్పాదుల వారిని అవమానించినట్లే కదా! సద్గురుమూర్తిని ఉపాధి స్వభావంతో ఎన్నడూ చూడరాదు. ఆయనకు గుణాలను ఆపాదించకూడదు. ఆయన గుణరహితుడు, రూపరహితుడు కాబట్టి దానికి భిన్నంగా ఏభావన చేసినా గురుతత్త్వము యొక్క అఖండత్వానికి భంగం కల్గుతుంది. గురుతత్త్వము అఖండమైనది.



ఒక ఉపాధికి పరిమితమైనది కాదు. అందువలన సగుణబ్రహ్మయై అవతరించిన గురుమూర్తిని గుణసహితునిగా భావన చేస్తే మామిడిపండును మామిడికాయగా చేసినట్లు అవుతుంది సుమా! అది - కించిజ్ఞత్వానికి, అజ్ఞానానికి, అవిద్యకీ సంకేతం. సద్గురుమూర్తి ప్రేమస్వరూపుడు, ఆయన ప్రేమ అవ్యాజమైనది, అనంతమైనది, అపారమైనది. దానికి హద్దులులేవు. ఆయనప్రేమ అన్నివేళలా అందరిపైనా ఒకేరీతిగా ఉంటుంది. అందులో భేదభావానికి తావులేదు.

అంత ఎందుకు? ఒక భవనం ఉందనుకోండి, ఆ భవనంలోని ఫ్యాన్లకి, లైట్లకి ఇంకా ఇతర పరికరాలకీ అన్నింటికీ అందచేయబడే విద్యుత్తులో ఏమైనా తేడా ఉంటుందా? సద్గురుమూర్తి అందించే ప్రేమలో వ్యత్యాసము ఉండదుకానీ ఆయనని ఆశ్రయించిన సాధకులు విభిన్న మనస్తత్త్వాలను కలిగినవారై ఉంటారు. వారందరి దృష్టి ఒకే రీతిగా వుండదు కదా! అందరూ గురుసాన్నిధ్యంలో ఉన్నవారైనా వారి వారి జన్మ సంస్కారమును అనుసరించి వారి సాధనలకు అనుగుణంగా వారి ప్రవర్తన ఉంటుంది.

ఇక్కడ మీకొక ఉదంతము చెబుతాను. ఒక కొలనులో ఒక కమలం ఉంటుంది. అది ఎంతో ఆకర్షణీయంగా సుగంధాన్ని వెదజల్లుతూ ఉంటుంది. దాని సుగంధానికి ఆకర్షించబడి దానిలోని మధుర పదార్థాన్ని స్వీకరించడానికి ఎక్కడినుంచో ఝుంకరిస్తూ ఒక తుమ్మెద వచ్చి పద్మాన్ని ఆశ్రయించి తనకి కావల్సిన పదార్థాన్ని సంగ్రహించి ఎగిరిపోతుంది. అది దానియొక్క సంస్కారము కానీ ఆ పద్మము క్రిందనే కొలనులో ఒక కప్ప ఉంటుంది. అది పద్మము క్రింద గెంతుతూ దానిపైన బురదను జల్లుతుంది. కప్ప ఆ పద్మముయొక్క విలువను గుర్తించ గల్గిందా? అది దానియొక్క సంస్కారము, అలాగే నిజమైన భక్తుడుకూడా సద్గురుమూర్తి అందించే మధురపదార్థాన్ని అందుకుని ఆనందిస్తాడు కానీ ఉపాధి స్వభావముతో గానీ, లేక ప్రాపంచికమైన కోర్కెలతోగానీ చూడడు కదా! అన్నారు.

నామీద ఎన్నో అభాండాలు వేశారు. నేను ధనవంతులకీ, వాహనాలున్నవారికీ మాత్రమే ఎక్కువగా ఇంటర్వ్యూలు ఇస్తానని అన్నవారూ లేకపోలేదు. నేను ధనానికీ, వాహనాలకీ ఎన్నడూ ఆశపడేవాణ్ణి కాదే! నన్నాశ్రయించిన వారిలో ధనవంతులూ ఉన్నారు. పేదవారూ వున్నారు. నాకందరూ సమానమే కానీ నన్నాశ్రయించిన ధనవంతుల ధనం పదిమందికీ ఉపయోగపడి వారి జన్మసార్థకం అవుతుందని, వారికి అటువంటి అవకాశాన్ని కలుగజేసి ఉండవచ్చు. ఆ విధంగా త్యాగం చేసినవారికి భగవానుడు కరుణించి ఇంకా ధనాన్ని ప్రసాదించి వుండవచ్చు. అది వారి అదృష్టం. దానిలో నాపాత్ర ఎంత? నేను మీ అందరి దాసానదాసుణ్ణి. మహాత్ములను విమర్శించినవారు అన్నియుగాలలోనూ ఉన్నారు. శ్రీకృష్ణపరమాత్ముడిని 'మాయావి' అని కౌరవులు

విమర్శించలేదా! షిరిడీ సాయిబాబా విషయంలో కొంతమంది భక్తులు బాబాని భిక్షకి వెళ్ళవద్దనీ ఆయనకు కావల్సినవన్నీ తావేం సమకూర్చగలమనీ చెప్పారు. అయితే శ్రీ బాబా వారికి సమాధానం చెబుతూ నేను భిక్షకు వెళ్ళేది కేవలం గింజలకోసంకాదు, భక్తులు నాకు సమర్పించే గింజలద్వారా వారి కర్మ రహితం అవుతుంది. మరి మీరు ఆపని చేయగల్గుతారా? వారి బదులు గింజలను ఇవ్వగల్గుతారుకానీ వారి కర్మను రహితంచేసే సమర్థత మీకు ఉందా? అని ప్రశ్నించారు. చూశారా! సద్గురుమూర్తి ఏ పనిచేసినా దానిలోని అంతర్యాన్ని సామాన్యమానవుడు గ్రహించగల్గుతాడా? దానిని అపార్థం చేసుకుంటాడు. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలి. వ్యాధిసోకిన వారికే వైద్యుని అవసరం ఉంటుంది. దీనిలోని అంతర్యాన్ని గ్రహించండి అన్నారు.

సద్గురుమూర్తి తమ అనుగ్రహాన్ని దృష్టిద్వారా, స్పర్శద్వారా, సంకల్పముద్వారా, హస్తమస్తక సంయోగము ద్వారా అందజేయ గల్గుతారు. అది వారివారి పాత్రలనుబట్టి ఉంటుంది. కంటిచూపు ద్వారా దర్శించిన దృశ్యముగానీ, చెవిద్వారా విన్న శబ్దముగానీ మానవునికి ఆసక్తిని కలుగజేస్తుంది. దానిద్వారా బంధనమేర్పడి అది జన్మకి దారితీస్తుంది సుమా! నీవు ఆశ్రయించిన సద్గురుమూర్తియందు వినయవిధేయతలు కలిగి ఉండడమేగాక, గురుమూర్తి అందరివాడు. సకల జగత్తు ఆయనదే. జగత్తులోని సమస్తజీవరాసులకు ఆయనే ఆధారం. కానీ ఉపాధిచెందే పరిణామానికీ, గురుశక్తికి సంబంధములేదు అనే విషయాన్ని గ్రహించాలి. అది కేవలం సాక్షి. ఆత్మవస్తువు లేక చైతన్యములేక గురుశక్తి ఏదన్నా ఒకటే. జగత్తులో జరిగే పరిణామానికి గురుశక్తికీ ఏ మాత్రం సంబంధంలేదు. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను.

బ్యాంకులో క్యాషియర్ ఉంటాడు. ఆ క్యాష్‌కి సంరక్షకుడు అతడే. ఏరకమైన తేడా రానియ్యడు. కానీ ఆ సొమ్ము అతని సొంతం మాత్రంకాదు. దానిని వినియోగించుకునే హక్కులేదు. దానిని సంరక్షించే బాధ్యత మాత్రము అతనిది. అలాగే ప్రతి సాధకుడు సద్గురుమూర్తి యందు వినయవిధేయతలు కలిగిఉండి గురుబోధాశ్రవణం ద్వారా విశ్వాసాన్ని పెంపొందించుకుని గురుఆజ్ఞా పాలనచేస్తే అంతకన్నా కావల్సిందేముంది?" అన్నారు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## వివేకవంతమైన విచారణ

వివేక దృష్టితో విచారణ చేస్తే వైరాగ్యం వస్తుంది. ప్రపంచంలో మనం అనేకం వింటున్నాం, చూస్తున్నాం. వాటికి మనం స్పందిస్తే అది కర్మ అయి కూర్చుంటుంది. మనం విచారణ చేయాలంటే ముందు శ్రవణం చేయాలి. సత్యగురువు వచనాలు వినాలి. చదువు వస్తే చదువు కోవచ్చు కూడాను. విన్నదానిని నువ్వు ఆచరిస్తేనే అది నీవు విన్నట్లు. విన్నది మనం ఆచరించాలి. ఉదాహరణకి, నేను ఒక అమ్మాయిని చూసి, 'అమ్మాయ్! ఇలారా!' అని పిలిచాననుకోండి. ఆ అమ్మాయి నా మాట విన్నది అంటే ఏం చేస్తుంది? వెంటనే నా దగ్గరకు వస్తుంది. అదీ విన్నదానికి సార్థకత.



కొంతమంది ఎన్నెన్నో చోట్లకి వెళ్ళి, ఎంతెంతమందో మట్లాడినవి వింటూ వుంటారు. 'ఫలానా వాళ్ళు వీరి కంటే బాగా మాట్లాడతారు' అని ఇలాంటి శబ్దాలు వినిపిస్తూ వుంటాయి. వినడం అనేది వాసన కాకూడదు. నువ్వు విన్నది నీకు జీవితంలో ఎంత వుపయోగపడుతుంది అని విచారణ చేయాలి. విన్నదాని వలన నీలోని గుణాలు ప్రేరేపించకుండా వున్నాయా?

శ్రీగురుదేవులు మనకు ఎన్నెన్నో అందిస్తున్నారు. వాటిని మనం ఎంతవరకు ఆచరిస్తున్నాం అని ఎవరిని వారు ప్రశ్నించుకోండి. ఇంకా పాత వాసనలతోనే ఆనందిస్తున్నారంటే, ఎవరి దుర్వాసన వారికే బాధ! తుడిచి శుభ్రంగా లేని ఇంటికి శ్రీకృష్ణుడు వస్తాడా? శ్రీ గురుదేవులు చింతలపూడి స్వామి గురించి చెప్పేవారు. ఆశ్రమం చుట్టూ తిరుగుతూ ఒక భక్తుడు శుభ్రం చేస్తున్న చోటుకి వచ్చి, 'నాయనా! ఇదే సరిగా శుభ్రం చేయటం లేదే? ఇక నీ మనస్సునెలా శుద్ధంగా వుంచుకుంటావు?' అన్నారుట.

భగవన్నామం చేస్తూ విచారణ చేసిననాడు, నీ హృదయం శుభ్ర పడుతుంది. గురుదేవులు నాటిన భక్తి బీజాలకు విశ్వాసము, విచారణ, ధ్యానము అనే నీటిని పోయాలి. గుణములు, ఈర్ష్య, అసూయ

మొదలైన కలుపు మొక్కలను తీసివేయాలి. అవగాహన కలిగి విచారణ చేస్తే సాధన ముందుకు వెళ్తుంది.

శ్రీగురుదేవులు మన చేత తరచూ భక్తుల చరిత్రలు చదివించే వారు. తాము కూడా చెప్పేవారు. 'ఏమర్రా! మీకు అనేక వృక్షాలతో నిండిన పెద్ద ఆశ్రమం ఇచ్చాను. మీరు విన్న ఆ బోధను హాయిగా వృక్షాల క్రింద కూర్చుని విచారణ చేసుకోండి. ఆనపచేనుకు అలవాటు పడ్డ ఆవు, తనకు కావలసినంత మేసిన తరువాత, తిరిగి మందలో కలవకుండా, హాయిగా ఒక చెట్టు క్రింద కూర్చుని తిన్నదంతా నెమరు వేసుకుంటుంది. అదే విధంగా మీరు విన్న గురుబోధనంతా చెట్టు క్రింద కూర్చుని హాయిగా మననం చేసుకోండి. మీకు ఆ బోధ గుర్తుకు రాలేదనుకోండి, భక్తుల చరిత్రలు చెప్పుకోండి. మీరా, సక్కూ, కబీర్‌దాస్, నరసింహ మేధ ......... ఇలా ఎంతెంతోమంది భక్తులను కన్న రత్నగర్భ మన భారత భూమి' అనేవారు శ్రీబాబు.

శ్రీ గురుదేవులు మన చేత భక్తుల చరిత్రలు ఎందుకు చదివించే వారు? తద్వారా మన జీవితాలలో కూడా గుర్తించి, వారు వెళ్ళిన బాటలో మనం కూడా వెళితే, మన జీవితాలు కూడా ధన్యమవుతాయని. శ్రీవారు భక్తుల చరిత్రలకు అంతటి ప్రాముఖ్యతనిచ్చేవారు.

సాధన చేయటానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, ఆయురారోగ్యాలను, సుఖశాంతులను, సాధనా సంపత్తిని ప్రసాదించి ఈ నూతన సంవత్సరంలో శ్రీగురుదేవులు మనందరినీ రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

డిసెంబర్ 9న భీమవరంలో 'ఆర్ట్ ఆఫ్ లివింగ్ బెంగుళూర్' వ్యవస్థాపకులుశ్రీ రవి శంకర్ స్వామీజీచే సత్కరింపబడుతున్న శ్రీమాతాజీ



# వచ్చిందండీ సంక్రాంతి! తెచ్చిందండీ ఆనంద హేల

- రమణ ప్రసాద్

మనకి జనవరి 15న వచ్చింది సంక్రాంతి. ఆంధ్ర రాష్ట్రంలో ఈ పండుగ నాలుగు రోజులపాటు చేస్తారు. అవి- మొదటిరోజు (జనవరి 14న) భోగి; రెండవరోజు మకర సంక్రాంతి (ఇది పెద్ద పండుగ రోజు); మూడవ రోజు కనుమ; నాల్గవ రోజు ముక్కనుమ.

భోగి రోజున కుటుంబంలోని పెద్దలూ, పిల్లలూ అందరూ కలిసి తెల్లవారుజామున, కొయ్య దుంగలు, పాత చెక్కలు, తదితర పనికి రాని పాత వస్తువులు మంటలో వేసి, పనికిరాని వాటికి స్వస్తి చెప్పి కొత్తదనానికి స్వాగతం పలుకుతారు. చాలా మంది ఇళ్ళలో శిశువులకు, పిల్లలకు అంటే మూడేళ్ళలోపు వారికి సాయంకాల వేడుకగా రేగుపళ్ళు, పువ్వులు, చిల్లర నాణాలు కలిపి తలపె పోసి వేడుక చేసుకుంటారు. దీనినే "భోగిపళ్లు పోయటం" అంటారు.



శ్రీ బాబూజీ మహరాజ్‌వారి అవతార కాలంలో వారికి తలకు నూనె పెట్టి తలంటు పోసేవారు. ఆ సాయంత్రం భక్తులందరూ కలిసి శ్రీ బాబూజీ వారికి రేగు పళ్లు పోసి, హారతి ఇచ్చేవారు. ఆ తరువాత శ్రీబాబూజీ వారు స్వయంగా అందరికీ తిరిగి వాటిని ఇచ్చేవారు. భక్తులు ఆ పళ్ళను ప్రసాదంగా గ్రహించి, నాణాలను పూజలో పెట్టుకొని, పువ్వులను పొలాలలో జల్లుకొనేవారు. శ్రీబాబూజీ వారి అవతార సమాప్త్యనంతరం ఆశ్రమ పీఠాధిపతి అయిన పూజ్యశ్రీ మాతాజీవారు శ్రీబాబూజీవారి మూర్తికి పళ్ళు పోసి, హారతిచ్చి, రేగుపళ్ళు భక్తులకు స్వయంగా పంచుతున్నారు. వాటి మహిమ భక్తులందరికీ విదితమే. అందువలన ఆరోజున చుట్టు పక్క గ్రామాలనుంచి తండోపతండాలుగా వచ్చి రేగుపళ్ళ ప్రసాదాన్ని తీసుకుంటారు. ఆనాడు కుటుంబ సభ్యులందరూ ఒకచోట కలిసి ఆనందిస్తారు. రుచికరమైన పిండివంటలు చేస్తారు. కుటుంబ పెద్ద కొత్తబట్టలు పిన్నలందరికీ పెడతారు.

రెండవరోజు మకర సంక్రాంతి. అందరికీ "పెద్ద పండుగ."అందరూ కొత్తబట్టలు ధరించి దేవుని పూజిస్తారు. శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో

గురుపూజ జరుగుతుంది. ఆ రోజున సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. మకర సంక్రమణంనాడు  మరణించిన పూర్వీకులకు సాంప్రదాయకంగా కొన్ని కర్మలను ఆచరిస్తారు. ఆ రోజున కొత్తగా వచ్చిన పంటలోని బియ్యాన్ని వండి "పొంగలి" చేసి ఆరగిస్తారు. కొన్ని ప్రాంతాలలో గాలిపటాలు ఎగురవేస్తారు.

మూడవరోజున కనుమనాడు ప్రత్యేకంగా ఆవులను, ఎద్దులను అలంకరించి పూజిస్తారు. ఆ రోజున ప్రయాణించటం అశుభంగా భావిస్తారు. గురువులు శిష్యులను ఆశీర్వదిస్తారు. ఇంతచేటు ఆనందోత్సహాలనిచ్చే పండుగను అందరూ జరుపుకుని ఆనందిస్తారు.

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమంలో ఈ సంబరాలన్నీ జరుపుకోవటంతో పాటు శ్రీగురుదేవుల పాదపూజ, విచ్చేసిన భక్తులందరికీ భక్త సమారాధన జరుగుతుంది..



డిసెంబర్ 3 శ్రీబాబూజీ స్వస్వరూపలయం చెందిన రోజు సందర్భంగా ఆశ్రమంలో జరిగిన గోపూజ కార్యక్రంలో పాల్గొన్న మాతాజీ



డిసెంబర్ 9న భీమవరంలో 'ఆర్ట్ ఆఫ్ లివింగ్ బెంగుళూర్' వ్యవస్థాపకులుశ్రీ రవి శంకర్ స్వామీజీని సత్కరిస్తున్న శ్రీ మాతాజీ




దిరుసుమర్రు సత్సంగ సమావేశంలో
జ్యోతిర్మయానంద మాతాజీతో
చంద్రకాళీ ప్రసాదమాతాజీ

డిసెంబర్ 14న దిరుసుమర్రు గ్రామంలో జరిగిన సత్సంగ కార్యక్రమ కర్తలతో పూజ చేయిస్తున్న శ్రీ మాతాజీ





డిసెంబర్ 11న భీమవరంలో
శ్రీదీప్తానందసరస్వతీ స్వామిజీ
(ఉచ్ఛలి)తో

# గరుడ గర్వ భంగం

- పళని

దేవేంద్రుడికి రథసారథి, అత్యంత సన్నిహితుడు అయిన మాతలికి సుధర్మ  అనే భార్య ఉండేది. వారికి లేక లేక ఆడపిల్ల కలిగింది. ఆమెకు గుణకేశి అనే పేరుపెట్టుకొని ఎంతో గారాబంగా పెంచారు. గుణకేశి పెరిగి యవ్వనవతి అయి మూడులోకాలలోనూ తన వంటి సౌందర్యవతి, లావణ్యవతి, అంగసౌష్ఠవంగలది లేదనిపించుకున్నది. ఆమెకు పెళ్ళి యీడు వచ్చేసరికి మాతలికి తగని విచారం పట్టుకుంది. ఎందుచేతనంటే గుణకేశికి తగిన వరుడు మామూలు మానవులలో గాని, యితర దేవ గణాలలోగానీ, ఋషులలో గానీ ఆయనకు ఒక్కడు కూడా కనబడలేదు.

చివరకు మాతలి విసుగు చెంది, తన భార్య అయిన సుధర్మతో 'అమ్మాయికి తగిన గుణవంతుడు, రూపవంతుడు పాతాళలోకంలో దొరుకుతాడేమో చూస్తాను' అని చెప్పి పాతాళానికి ప్రయాణం అయ్యాడు.

ఆయనకు దారిలో నారదుడు తగిలి, కుశల ప్రశ్నలు వేసి, 'ఎక్కడికి ప్రయాణం? సొంతపనిమీద? ఇంద్రుడి పనిమీద?' అని అడిగాడు. మాతలి తన పని గురించి నారదునికి చెప్పి, నేను వరుణదేవుడిని చూడటానికి పాతాళానికి వెడుతున్నాను అన్నాడు. 'ఇంకేమి నేను కూడా వరుణుడిని చూడటానికి వెడుతున్నాను. ఇద్దరమూ కలిసి పోదాము' అన్నాడు నారదుడు.

నారదుడికి, మాతలికి వరుణుడు స్వాగతమిచ్చి ఇంద్రుడికి జరుపదగిన మర్యాదలన్నీ మాతలికి జరిపాడు. తరువాత వారు వరుణుడి అనుమతితో పాతాళంలోని వివిధ ప్రాంతాలు పర్యటించటానికి వెళ్ళారు. ఒకచోట హిరణ్యపురం అనే మహానగరం ఉంది. అది వరుణుడు నిర్మించినది. ఇతర లోకాలలో ఓడిపోయిన రాక్షసులు అందరూ అక్కడ నివశిస్తారు. ఆ నగరంలో అల్లుణ్ణి వెతకటానికి మాతలికి మనస్కరించ లేదు.

తరువాత వారిద్దరూ నాగలోకంలో ఉండే భోగవతీపురానికి వెళ్ళారు. ఆ నగరానికి వాసుకి రాజు. శేషుడు ఇంకా ఇతర మహా సర్పాలు అక్కడ తిరుగుతూ ఉన్నారు. అక్కడ తిరుగుతుండగా ఒక చక్కని యువకుడు మాతలికి కంటపడ్డాడు. వెంటనే మాతలి నారదునితో ఆ కుఱ్ఱవాడెవడు? అతని తల్లిదండ్రులెవరు? ఇతను నాకు బాగా నచ్చాడు' అన్నాడు. నారదుడు 'ఇతని పేరు సుముఖుడు. వీరిది ఐరావతం వంశం.

ఆర్యకుడు ఇతని తాత. ఇతని తండ్రిని, శుకురుడిని ఇద్దరినీ గరుత్మంతుడు చంపాడు' అన్నాడు. మాతలి 'ఇతను చాలా అందంగా ఉన్నడు. వీడు నా కూతురిని చేసుకోవటానికి సమ్మతించేటట్లు చేయగలవా?' అన్నాడు నారదునితో.

నారదుడు మాతలిని వెంటబెట్టుకుని ఆ ఆర్యకుడి దగ్గరకు వెళ్ళి 'ఇతను తన కుమార్తెకు తగిన వరుడి కోసం మూడు లోకాలు వెతికి, చివరికి ఇక్కడ నీ మనవడిని చూసి తన అల్లుడు కాదగినవాడని ఎన్నుకున్నాడు. అందుచేత ఇతని కుమర్తె గుణకేశిని నీ మనవడు సుముఖుడికి చేసుకుంటే చాలా బాగుంటుంది' అన్నాడు నారదుడు.

దానికి ఆర్యకుడు దీనంగా 'నారదా! ఎంతో చక్కని మాట చెప్పావు గాని, నా మనస్సులో సంతోషంగా లేదు. ఎందుకంటే నా మనవడికి మహావిపత్తు సిద్ధంగా ఉంది. గరుత్మంతుడు మొన్నమొన్ననే వీడి తండ్రిని పొట్టనపెట్టుకున్నాడు. పై మాసంలో వీడిని చంపి తింటానని శపథం చేశాడు' అన్నాడు.

అది విని మాతలి 'నాగరాజా! నీ మనవడిని అల్లుడిగా వరించాను. కనుక అతనిని కాపాడే భారం నాది. సుముఖుడిని మా వెంట పంపించు. నేను అతడిని దేవేంద్రుడికి పరిచయం చేసి చేయవలసిన వన్నీ చేస్తాను. మీరేమీ దిగులు పడవద్దు' అన్నాడు.

మాతలి, నారదుడు, సుముఖుడు ముగ్గురూ కలిసి దేవలోకానికి తిరిగి వచ్చి ఇంద్రుడి సమక్షానికి వచ్చారు. వారు చేరే సమయానికి ఇంద్రుడు, విష్ణువు కబుర్లు చెప్పుకుంటున్నారు. మాతలి విష్ణువుతో సంగతి సందర్భాలు చెప్పాడు. విష్ణువు అంతావిని ఇంద్రునితో 'ఇంద్రా! సుముఖునికి అమృతం ఇచ్చి, అతనికి చావులేకుండా చెయ్యి' అన్నాడు విష్ణువు.

ఇంద్రుడు అలా చేయడానికి భయపడ్డాడు. పరాక్రమవంతుడైన గరుత్మంతునితో వైరం పెట్టుకోవటం ఇష్టం లేక ఇంద్రుడు విష్ణువుతో ఆ ఆ అమృతం నీవే ఇవ్వు. అన్ని లోకాలకు అధిపతివి నీవే.' అన్నాడు. అయినా దేవేంద్రుడికి అమృతం ఇవ్వటం ఇష్టం లేక దీర్ఘాయువు ఇచ్చాడు. దానితోనే సుముఖుడికి గరుత్మంతుడి భయం పోయి మాతలి కూతురిని పెళ్ళాడి తన లోకానికి వెళ్ళిపోయాడు.

ఈ వార్త విని మండిపడుతూ గరుత్మంతుడు మహావేగంతో ఇంద్రుడి వద్దకు వచ్చి మహారౌద్రంగా 'ఏమిటిది? ఇంద్రా! నా నోటి దగ్గర

కూడు తీసేశావా! బ్రహ్మ నాకు ఆహారం ఏర్పాటు చేసినదానిని నిరాకరించ డానికి నీకేమి హక్కు ఉంది? సుముఖుణ్ణి చంపి తింటానని ప్రతిజ్ఞ చేశాను. ప్రపంచంలో నా లాంటి బలాఢ్యుడు లేడు. ఒక ఈకతో సునాయాసంగా మోయగలను. నేను విష్ణువును వీపు మీద మోస్తూ సేవ చేస్తున్నానని నీకు లోకువైనట్లుగా ఉన్నది. ఈ విష్ణువు మూలంగానే నా పరువంతా పోయింది.' అన్నాడు.

అతని ప్రేలాపన విని విష్ణుమూర్తి 'గరుడా! నీకు బుద్ధి లేదు. అతి దుర్బలుడవై వుండికూడా ఆత్మస్తుతి చేసుకుంటున్నావు. నన్ను మోస్తున్నావని నీవు అనటం అనుచితమూ, అబద్ధమూ కూడాను. నన్ను నేనే మోసుకుంటూ, నిన్ను కూడా మోస్తున్నాను. నీకు నమ్మకంలేని పక్షంలో నా ఎడమ చెయ్యి ఒకటి మొయ్యి చాలు' అంటూ తన ఎడమ చేతిని గరుడుని వీపుపైన పెట్టాడు. ఆ బరువుకు గరుడుడు అణగారిపోయి మూడులోకాలు తనపైన ఒక్కపెట్టున విరుచుకుపడ్డట్లయి గిలగిలా తన్నుకున్నాడు.

ఆ గరుత్మంతుడి ప్రాణాలు తల్లడిల్లుకుంటూ "చచ్చిపోతున్నా! అజ్ఞానంతో కాని కూతలు కూశాను. నిన్ను మోస్తున్నాననే గర్వమే ఈ గతికి తెచ్చింది. రక్షించు" అని దీనంగా ప్రార్థించాడు.

విష్ణుమూర్తి అనుగ్రహించి 'ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించకు. ఇంద్రుడి వరాన్ని గౌరవించి, సుముఖుడితో సఖ్యంగా ఉండు. నీకు నిజంగా గర్వభంగమైనట్లు శాశ్వతమైనగుర్తు!' అన్నాడు. ఆనాటి నుండి గరుత్మంతుడు తన శత్రుత్వాన్ని వదులుకున్నాడు.



దిరుసుమర్రు గ్రామంలో సుమారు 1950 ప్రాంతంలో శ్రీబాబూజీ మహరాజ్‌వారు విడిదిచేసిన కలిదిండి పేర్రాజు గారి గృహం

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

**జ్ఞాన ఖండం**

**13వ అధ్యాయం**

ముని కుమారుడు రాజుని బయటకు తీసుకువచ్చి అతని శరీరంలో ప్రవేశింపజేశాడు. అతడికి లోకం కొత్తగా కనిపించింది. ఇది గ్రహించిన ముని కుమారుడు, 'రాజా! ఇదిమునుపటి లోకమే. కాని12 అర్బుద సంవత్సరాల తరువాత మనుష్యులు, వారి వ్యవహారాలు మారాయి. నీ అన్నగారి వంశంలో వేల మంది పుట్టి చనిపోయారు. రాజుకు గతించిన తనవారిని తలచుకుని దుఃఖంతో కుప్పకూలి పోయాడు.



ముని కుమారుడు ధ్యైరం చెబుతూ,"రాజా!చనిపోయినవారి గురించి ఏడవటం ధర్మమా? బంధువులు చనిపోతే ఏడవాలి అంటావా? అయితే విను. నీవు దేహం కాదు. దేహివి. దేహం కలవాడవు. ఇది నా దేహం అంటున్నావు కదా. అలాగే ఇది నా వస్త్రం అన్నప్పుడు ఆ వస్త్రం నువ్వు కాదు. వస్త్రంలాంటి శరీరంతో నీకు సంబంధం లేదు. నా శరీరం, నా ఇంద్రియాలు అంటున్నావు."నా" అనే నీ స్వరూపం ఏమిటి?" రాజు చెప్పలేకపోయాడు.

మునికుమారుడు తిరిగి ఇలా అన్నాడు,"రాజా! జనులు త్రిపురామహాదేవి మాయలో మోహితులవుతున్నారు. స్వాత్మను తెలిసికొనలేక దుఃఖితుల వుతున్నారు. ఐంద్రజాలికుడు ఒక సర్పాన్ని సృష్టిస్తాడు అది నిజమైన సర్పమని భావించి దుఃఖిస్తారు. నిజం తెలిసాక ఇది గారడీవాని మాయని తెలిసికొని దుఃఖించరు.

ఆత్మ జ్ఞానులు ఈ మాయను అతిక్రమిస్తారు. స్వప్నంలో భాసించేది అసత్యం. జాగ్రదవస్థలో భాసించేదికూడా అసత్యమే. ఈ విషయం సూక్ష్మ దృష్టితో పరీక్షించి తెలుసుకో!

**14వ అధ్యాయము**

జగత్తు భావనా మాత్రమే అని ముని చెప్పిన మాటలు విని మహాసేనుడు విచారణ చేసి జగత్తు స్వప్నసమానవే అని తెలుసుకొన్నాడు. వెంటనే శోకం పోయింది. శరీరం కంటె వెలుపల అంటున్నాం అంటే వెలుపల అనేదానికి శరీరం అపాదానం కావాలి. భాస్యము (ప్రకాశింపబడేది), భాసకం(ప్రకాశింపజేసేది)కంటె వెలుపల ఉన్నది అనటం కుదరదు. కాబట్టి తెలిసికొనేది, తెలియబడేది ఒకటి కాదు.

భాసకము అనగా భాసనము (ప్రకాశించుట) అనే క్రియ కలది. క్రియ అనిత్య ధర్మము. అప్పుడు భాసకత్వమూ అనిత్యమే అవుతుంది. అయితే పరాచితి ఎప్పుడూ భాసించేది అని ఎలా అన్నారు?

ఇక్కడ కర్తకు క్రియకు భేదం లేదు. క్రియతో కూడినదే కర్త. భాసకమనగా భాసరూపవే. అందువలన అది పూర్ణం. అది దేశకాలాలన్నిటికీ వ్యాపించినది. ఆ విధంగానే చిన్మాత్రమైన ఆత్మ కంటె వేరు సత్త లేదు. పరాచితి ఏకరూపమే అయినా తనలో బాహ్యమైన ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తోంది. చిచ్ఛక్తియే పరా ప్రకృతి. ఇది జగత్తుకు మూలాధారం. నేను ఆ భావనతో నిర్మించిన ఈ శైలలోకంలో ఒక రోజు గడిచింది. (బ్రహ్మ సృష్టి కాలంలో 12 అర్బుద సంవత్సరాలు).

మహాసేనుడు ఆ మాటలను విని, జగత్తు సత్యము, దేహం ఆత్మ అనే భ్రమనుండి బయటపడి ఆత్మయే నిత్యం, అని తెలిసికొని, కామ క్రోధాదులను వదలివేసి, నిర్వికల్ప సమాధిస్థుడై విదేహముక్తి(నిర్వాణం)ని పొందాడు.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల ప్రియతమ భక్తులు, కాజా వెంకట సుబ్రహ్మణ్య జానకిరామ్ గారు 9-12-2017 శనివారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 72 సంవత్సరాలు.

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శరణాగతుని బాధ్యత భగవంతునిదే

- గాలి జగదీశ్

విభీషణుడు శ్రీరాముని చరణకమలాలను శరణు పొంది, అతనికి శరణాగతుడయ్యాడు. ఇహ శ్రీరాముడు విభీషణుని దోషాలను తన దోషాలుగానే భావించాడు. ఒకసారి లంకలో సముద్రం ఒడ్డుకు వచ్చాడు. అక్కడ విప్రఘోష అనే గ్రామంలోని ఒక బ్రాహ్మణుడిని విభీషణుడు అనాలోచితంగా హత్యచేశాడు. దానితో అక్కడి బ్రాహ్మణులంతా కలసి, విభీషణుడిని చితకబాది, గొలుసులతో కట్టి, భూమిలోపల గల ఒక గుహలో పడేసి, గుహద్వారం మూసివేశారు.

శ్రీరాముడికి విషయం తెలిసి, పుష్పక విమానమెక్కి ఆ స్థలానికి చేరుకున్నాడు. అక్కడి బ్రాహ్మణులందరూ శ్రీరాముడిని ఎంతో ఆదరించి, సేవించి ఇలా అన్నారు "రామచంద్రా! విభీషణుడు ఒక బ్రాహ్మణుని హత్య చేశాడు. అందుకని మేము అతనిని కొట్టి, కట్టిపడేశాము. అయినా కూడా అతడు మరణించలేదు" అన్నారు.

శ్రీరాముడు మాట్లాడుతూ "ఓ విప్రులారా! విభీషణుడికి నేను కల్పాంత ఆయుష్షును, రాజ్యాన్ని ఇచ్చాను. అందువల్ల అతడు మరణించడు. పైగా అతన్ని కొట్టవలసిన అవసరం ఏమిటి? అతడు నా భక్తుడు. నా భక్తుని కోసం నేను స్వయంగా మరణించటానికి సిద్ధంగా వున్నాను. ఇక్కడ ఆచారం ఏమిటంటే, భక్తుడి అపరాధాల బాధ్యతను యజమాని తీసుకుంటాడు. అందువల్ల యజమానే శిక్షకు అర్హుడవుతాడు. కాబట్టి మీరు విభీషణుడికి బదులుగా నన్ను శిక్షించండి" అన్నాడు.

భగవంతుడైన శ్రీరామచంద్రుని శరణాగత వాత్సల్యాన్ని చూసి ఆ విప్రులంతా ఆశ్చర్యచకితులయ్యారు. వారందరూ క్షమించమని వేడుకుని శ్రీరామునికి శరణాగతులయ్యారు.

శరణాగతుడు చేయవలసిన పని ఏమిటంటే, అతడు నిశ్చింతగా నిర్భయంగా, నిస్సందేహంగా ఉండాలి. ఒకవేళ నీలో చింతా, భయం, భ్రమ మొదలైన దోషాలు కలిగితే అవి శరణాగతికి అడ్డంకులౌతాయి. అంతేకాక భారమంతా నీ మీదకే వచ్చేస్తుంది. శరణుపొంది కూడా నీ మీదకు బరువును తెచ్చుకోవటం శరణాగతిలో కళంకమవుతుంది. అందుచే ఆ బాధ్యతను శరణిచ్చినవానికే వదిలివేయాలి. అతడే నీ రక్షకుడు!!

# గోదాదేవి

- రమణ ప్రసాద్

మాలే! మణివల్లా! మార్గళి నీరాడువాన్
మేలైయార్ శెయ్ వనగళ్ వేణ్ణువన కేట్టియేల్
ఞాలత్తై యెల్లామ్ నడుఙ్గ మురల్వన
పాలన్న వణత్తు ఉనపాఞ్గన్నియమే
పోల్వన శఙ్గఙ్గళ్, పోయ్ ప్పాడుడై యనవే
శాలప్పెరుమ్ పరైయే, పల్లాణ్ణిశైపారే
కోలవిళక్కే, కొడియే, విదానమే
ఆవిలైయాయ్! అరుళలోరెమ్బావాయ్।

"ఆశ్రిత వ్యామోహం కలవాడా! ఇంద్రనీలమణిని పోలిన కాంతి, స్వభావంకలవాడా! అఘటిత ఘటనాసామర్థ్యం చేత చిన్న మర్రిఆకుపై అమరి ఉండేవాడా! మేము మార్గశిర స్నానం చేయగోరి కావలసిన పరికరాలను అర్థించటానికి నీ దగ్గరకు వచ్చాము. ఈ వ్రతాన్ని మా పూర్వులు ఆచరించారు. దానికి కావలసిన పరికరాలు నీకు విన్నవిస్తున్నాము. ఈ భూమండలముంతా వణికేటట్లు శబ్దం చేసే, పాలవలె తెల్లనైన పాంచజన్య శంఖంలాంటి శంఖం, విశాలమైన ఎంతో పెద్ద 'పర' అనే వాద్యము కావాలి. ఇంకా మంగళవాద్యాలు కావాలి. గానంచేసే భాగవతులు కావాలి. మంగళదీపాలు , ధ్వజాలు, మేలుకట్లు కావాలి. దయచేసి ఈ పరికరాలు మాపై



కృపతో అనుగ్రహించు" -అని గోపికలు శ్రీకృష్ణుణ్ణి ఈ 26వ పాసురంలో ప్రార్థించారు

శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవి (ఆండాళ్) జన్మించిన ఊరు. ఆమె భూదేవి అవతారం. 12మంది ఆళ్వార్లలో స్త్రీ ఈమె ఒక్కత్తే. విష్ణు చిత్తుడు ముకుందాచార్యునకు, పద్మమ్మ దంపతులకు జన్మించాడు.బాల్యంనుండి

అతడు విష్ణు భక్తుడు. చిన్నప్పుడే అతడు అన్ని శాస్త్రాలను అభ్యసించాడు. ఆయనను అందరూ గౌరవభావంతో "పెరియాళ్వార్" అని పిలిచేవారు.

ఒకరోజు ఒక ముద్దులొలికే బాలికను తులసీవనంలో చూశాడు. ఆమెను తెచ్చుకొని "గోదా" అని నామకరణం చేశాడు. ఆమెకు రామాయణ, భారత పురాణ కథలను వినిపించేవాడు. శ్రీ కృష్ణుని బాల లీలలను వినిపించేవాడు. ఆమె పెరిగి పెద్దయైనకొద్దీ ఆమెకు రంగనాథునిపై ప్రేమ పెరుగుతూ వచ్చింది. శ్రీరంగనాథుడిని తప్ప ఇంకొకరిని వివాహం చేసుకోనని నిశ్చయించుకొంది. విష్ణుచిత్తుడు రంగనాథునికొరకు తయారు చేసిన పూమాలలను తాను ధరించి, అద్దంలో చూసుకుంటూ,"నేను  అందంగా ఉన్నానా? నేను రంగనాథునికి తగిన భార్య అనిపించుకుంటానా? ఈ మాల నా రంగనాథునికి నప్పుతుందా?"అని చూసుకొనేది.

ఇది చూసిన విష్ణుచిత్తుడు దేవునికి వేసే మాలను ధరించరాదని హెచ్చరిక చేశాడు. కాని ఆమె రోజూ ఆ మాలను ధరించేది. శ్రీ రంగనాథుడు విష్ణుచిత్తునికి కలలో కనిపించి, "గోద ధరించిన మాల నాకు ఎంతో ఇష్టం. అని గోదను నా వద్దకు తీసుకొని రా! నేనామెను స్వీకరిస్తాను" అని చెప్పాడు. గోద ఆలయ గర్భగుడిలో ప్రవేశించి ఆయనలో ఐక్యమైపోయింది. అప్పటినుంచి ఆమెకు "ఆండాళ్" అనే పేరు వచ్చింది.

ఫాల్గుణమాసంలో శ్రీ విల్లిపుత్తూరులోశ్రీఆండాళ్ ఆలయంలో శ్రీఆండాళ్, శ్రీ రంగనాథస్వామి వార్ల వివాహ మహోత్సవం ఎంతో వైభవంగా చేస్తారు. ఆండాళ్ రంగనాథునికి పూమాల వేయటమే కాక రంగనాథునిపై తనకు కల దివ్య ప్రేమను, భక్తిని తెలిపే రెండు  పద్యాల మాలలు అల్లి స్వామికి సమర్పణ చేసింది. అవి- తిరుప్పావై - 30 పాసురాలు; నాచియాం తిరుమోళి - 143 పాసురాలు.  అవి ప్రపంచానికి తత్త్వం, హితం, పురుషార్థం, తెలపటమే కాక మానవ వికాసానికి తోడ్పడే సద్గుణాలు ఎలా అలవరచుకోవాలో తెలుపుతాయి. వైష్ణవాలయాలలో మార్గశీర్షమాసంలో ఈ పాసురాలను ఎంతో భక్తి ప్రపత్తులతో చదువుతారు.

# పాత్రనెరిగిన దానం

- మురళీ

ఒక ఊరిలో రామయ్యశాస్త్రి అనే పెద్దమనిషి ఉండేవాడు. సదాచార సంపన్నుడు. ఎప్పుడూ ఎన్నో పుణ్యకర్మలు, యజ్ఞయాగాది క్రతువులు, దానధర్మాలు చేస్తూ ఉండేవాడు. దానితో అతని ఆస్తి అంతా హారతికర్పూరంలాగ హరించుకు పోయింది. చివరకు కడుపునిండా తినడానికి కూడా ఏమీ మిగలలేదు. అప్పుడు ఆయన భార్య ఒకరోజు ఆయనతో "నాధా! ప్రక్క ఊరిలోని షావుకారు 'పుణ్యం' కొంటాడు. కాబట్టి మీరు ఆర్జించిన పుణ్యకార్యాలలో ఏదేనీ ఒకటి అమ్మి కొంత సొమ్ము తీసుకు రండి. దానితో మనకు కొంతకాలం భుక్తికి లోటు ఉండదు' అని సలహా చెప్పింది. అది రామయ్యకు నచ్చకపోయినా కూడా భార్యమాటను కాదన లేక ప్రక్క గ్రామానికి బయలుదేరాడు.

ఆయన భార్య దారిలో తినడానికి నాలుగు రొట్టెలు చేసి ఇచ్చింది. రామయ్య అలా ప్రయాణం చేస్తూ ఒక చెరువు దగ్గర ఆగి, కాలకృత్యాలు తీర్చుకుని, ఆ రొట్టెలు తినడానికి ఉపక్రమించాడు. ఇంతలో ఎదురుగా బక్కచిక్కిన ఒక కుక్క దాని పిల్లలతో సహా వచ్చి నిలబడి ఆశగా చూస్తోంది రొట్టెల వంక. దాని ఆకలిని గమనించిన రామయ్య జాలిపడి ఒక రొట్టెను దాని ముందు ఉంచాడు. అది గబగబా దాన్ని తినేసింది. మరొకటి పెట్టాడు. అలా వరుసగా నాలుగు రొట్టెలను నాలుగు కుక్కలూ కలిసి తినేసి తోకాడించుకుంటూ వెళ్ళిపోయాయి. రామయ్య ఖాళీ కడుపుతో కాసిని మంచినీళ్ళు త్రాగి తిరిగి ప్రయాణం సాగించాడు.

ఆ ఊరిలో షావుకారిని కలుసుకుని, తన పుణ్యం అమ్మే విషయం ప్రస్తావించాడు. ఆ షావుకారు మధ్యాహ్నం కలుసుకోమని చెప్పి వెళ్ళిపోయాడు. ఇంటికి వెళ్ళి ఆ షావుకారు తన భార్యతో ఈ విషయాన్ని చెప్పి, అతని పుణ్యాలలో ఏ పుణ్యం కొనవచ్చునో తెలపమని అడిగాడు. అమె మహా పతివ్రత. త్రికాలజ్ఞురాలు. పాతివ్రత్య మహిమ చేత ఆమెకు అన్నీ తెలుస్తూ ఉండేవి. ఆమె తన భర్తతో 'రామయ్య ఈ రోజు చెరువు గట్టు దగ్గర నాలుగు ఆకలిగొన్న కుక్కలకు రొట్టెముక్కలు పెట్టాడు. దాన్ని మించిన పుణ్యం వేరొకటి లేదు. అది కొనండి' అని చెప్పింది.

అనుకున్న సమయానికి రామయ్య షావుకారు దగ్గరకు వచ్చి,

‘అయ్యా! మీరు నా పుణ్యాలలో దేన్ని కొనాలనుకుంటున్నారు?’ అని ప్రశ్నించాడు. దానికి ఆ షావుకారు సమాధానంగా ‘మీరు ఈ రోజు చెరువు గట్టు దగ్గర కుక్కలకు పెట్టిన రొట్టెల పుణ్యాన్ని కొనదలచుకున్నాను’ అని చెప్పాడు. దానికి రామయ్య ఆశ్చర్యంగా ‘ఈ రోజు అక్కడ ఆ సమయంలో ఎవ్వరూ లేరే! మరి మీకు ఈ విషయం ఎలా తెలిసింది?’ అని అడిగాడు. అప్పుడు షావుకారు ‘నా భార్య పతివ్రత. ఆమెకు అన్నీ తెలుస్తాయి. ఆమె నాకు ఈ విషయాన్ని చెప్పింది’ అని చెప్పాడు. రామయ్య ‘సరే! మంచిది. నా పుణ్యానికి ఎలా లెక్క కడతారు మరి?’ అని అడిగాడు. షావుకారు ‘మీ రొట్టెలు నాలుగు ఎంత బరువు ఉన్నాయో తూచి దానికి సరిపడ బరువుగల రత్నాలు, ముత్యాలు ఇస్తాను’ అని చెప్పాడు.

షావుకారు ఇంట్లో నుండి నాలుగు రొట్టెలు తెప్పించి వాటిని ఒక త్రాసులో ఒకవైపు ఉంచాడు. రెండవ వైపు రత్నాలు, ముత్యాలు వుంచాడు. ఎన్ని ఉంచినా సరే రొట్టెల వైపు త్రాసు పైకి లేవలేదు. తన పుణ్యఫలం ఎంతో చూసుకున్న రామయ్య, షావుకారితో ‘అయ్యా! నేను ఇప్పుడు నా పుణ్యాన్ని అమ్మదలచుకోలేదు’ అని చెప్పి తిరిగి ప్రయాణం అయ్యాడు. చెరువు గట్టున కుక్కకు రొట్టెలు తినిపించిన ప్రదేశానికి వెళ్ళి అక్కడ మెరుస్తున్న రాళ్ళను మూటకట్టుకుని ఇంటికి వెళ్ళి తన భార్యకు అందించి, తాను వేరే పని మీద బయటకు వెళ్ళాడు.

రామయ్య భార్య ఆతృతగా ఆ మూటలో ఏమున్నదో అని విప్పి చూసేసరికి, దాని నిండా మణులు, మాణిక్యాలు, ముత్యాలు, రత్నాలు ఉన్నాయి. వాటిని చూసి ఆమె ఎంతో ఆనందపడి, తన భర్త యింటికి రాగానే ‘మీరు తెచ్చిన మూటలో ఎన్ని మణిమాణిక్యాలున్నాయో చూడండి!’ అంటూ ఎదురుగా పెట్టింది. అది చూసిన రామయ్యశాస్త్రి ఎంతో ఆశ్చర్యపోయాడు!

**లేమితో బాధపడుతున్న ఏ ప్రాణికైనా చేసిన దానము అనంతమైన పుణ్యఫలాన్నిప్రసాదిస్తుందని, భగవంతుని దయతో రాళ్ళు కూడా మణులుగా మారుతాయని రామయ్య గ్రహించాడు.**

# శివుని కథలు

- రమణ ప్రసాద్

## నీలకంఠుడు

చేత త్రిశూలంతో, మెడలో సర్పాలతో, శిరమున చంద్రవంకతో, పులి చర్మాంబర ధారియై, వృషభవాహనుడైన నీలకంఠుడు, వరాలనొసగే కరములతో నాకు ప్రసన్నుడగు గాక!

ఆయనకు నీలకంఠుడనే పేరు ఎలా వచ్చిందో చూద్దాం:- మృత్యువు లేకుండా చేసే అమృతాన్ని పొందటానికి దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగరంలో మంధర పర్వతాన్ని పెట్టి, వాసుకి అనే పామును దాని చుట్టూ కట్టి, ఒకవైపు రాక్షసులు, ఇంకొకవైపు దేవతలు క్షీర సాగర మథనం చేస్తుంటే, విపరీతమైన బాధను భరించలేక వాసుకి హాలాహలాన్ని కక్కింది. అదే సమయంలో సముద్రాన్నుంచి కూడా హాలాహలం ఉద్భవించింది. ఈ రెండు హాలాహలాలూ రాక్షసులు దేవతలకే కాక సమస్త మానవకోటికి ఉపద్రవంగా పరిణమించింది. మహావిష్ణువు ఆ హాలాహలాన్ని ఆపాలని చేసిన ప్రయత్నంలో అతని శరీరమంతా నీలవర్ణమైంది. అతడు విఫలుడు కావటంతో అందరూ కలిసి శివుని శరణు వేడారు. అంతవరకు ఆయనకు అమృతాన్ని ఇవ్వాలని వారికి తట్టలేదు. ఈ ఉపద్రవం రావటంతో ఆయన గుర్తుకు వచ్చాడు. శరణాగత రక్షకుడైన శివుడు ఆ హాలాహలాన్ని ఒకు పండు వలె చేత ధరించి “ఏం చేయమంటారు?” అని అడిగాడు. “దేవాదిదేవా! మీరు ఆ విషాన్ని వదిలితే మేమంతా నాశనమవుతాము”అన్నారు. సదాశివుడు చిరునవ్వుతో దాన్ని నోట్లో వేసుకొన్నాడు. కాని సర్వ ప్రపంచాలు ఆయన కుక్షిలో ఉన్నాయి. ఆ విషం కుక్షిలోకి వెళితే సమస్త లోకాలకు హాని వాటిల్లుతుందని గమనించిన జగన్మాత తన చేతితో ఆ హాలాహలాన్ని శివుని కంఠం వద్ద నిలిపింది. అప్పుడు ఆయన కంఠం నీలివర్ణమైంది. అందుకే ఆయనకు “నీలకంఠుడు” అనే పేరు వచ్చింది.

సదాశివుని కృప పొందిన దేవతలు, రాక్షసులు క్షీర సాగర మథనం చేయగా వచ్చిన అమృతాన్ని శివుడు దేవతలకు ప్రసాదించాడు. తాను మాత్రం హాలాహలాన్ని మ్రింగాడు. మృత్యుంజయుడైన సాంబ సదాశివునికి ఆ అమృతంతో పని ఏముంది?

# మూలాజ్ఞానం

-పరాశర ప్రసాద్

ప్రాపంచిక వ్యవహారాలలో కొన్నింటిలో ప్రవేశము లేకపోవచ్చు. ఆ వ్యవహారాలలో సరైన అవగాహన లేకపోవటం అజ్ఞానమే. అయితే ప్రాపంచిక వ్యవహారాల అజ్ఞానము తూలాజ్ఞానముగా భావింప బడుతోంది. అలా కాకుండా మానవుడు తానెవరో తన అసలు స్వరూప మేదో అవగాహన లేకపోవటమే అజ్ఞానం. అయితే తన స్వరూపమేదో తెలుసుకోక పోవటానికి అడ్డుపడే ఆవరణదోషమే మూలాజ్ఞానము అని పిలువ బడుతోంది.

ఆవరణ దోషము అంటే మానవుని చుట్టూ ఆవరించి వున్న పరిసరాల ప్రభావం మాత్రం కాదు. ఆవరణ అంటే తన ఉపాధి, లేక దేహము తనకి ఆవరణ. దేహభావనే ఆవరణ దోషం. అదే మూలాజ్ఞానం. అదే మాయ. మాయ అనేది సాధకునికి రెండు విధాల అంతరాయం కలిగిస్తుంది. ఆచ్ఛాదన ద్వారాగానీ, భ్రమణం ద్వారాగానీ అంతరాయం కలిగించవచ్చు. మబ్బు కమ్మితే సూర్యుని దర్శించలేము కదా! అలాగే మాయ అనేది ఆచ్ఛాదనగా అంటే ఆవరణగా కమ్మి వుంటుంది.

దేహము, లేక ఉపాధి ఆవరణ కాదు. ఆవరణ దోషము అనేది మనస్సులోని భావన, లేక తలంపు. రూపనామ క్రియా రహితమైన 'నేను' అనే ఆత్మ వస్తువు నుంచి 'నేను' అనే భావన, లేక తలంపు బయలు దేరుతుంది. అదే ఆవరణ దోషము. ఆ నేను అనే భావన క్రమేపి 'నాది' అనే భావనని ఉద్భవింపజేస్తుంది. నేను, నాది అనే భావనల ద్వారా నా బంధువులు, నా స్నేహితులు, నా కులం, నా గోత్రం, నా రాష్ట్రం, నా దేశం అనే భావనలకి కారణమై బంధాన్ని తెచ్చి పెడుతుంది. అదే దేహాభిమానం. మాయ ఆచ్ఛాదనగా కాకుండా భ్రమణంగా వేధించవచ్చు. మనస్సు సంచారిగా విక్షేపణచెంది, బంధాన్ని తెచ్చి పెడుతుంది. ఈ రెండు ప్రక్రియల ద్వారా వస్తువును గుర్తించ లేకపోవటమే కాకుండా వేరొక విధంగా గుర్తించటం కూడా అజ్ఞానమే.

వేడి కాఫీగ్లాసుతో ఇచ్చారనుకుందాం. కాఫీకి బదులుగా గ్లాసు వేడిగా ఉందని భావించటం. కాఫీ వేడిని గ్లాసుపై ఆరోపితమవడాన్ని అధ్యాస అంటారు. భావనా రహితమైన నేను పైన నేను అనే భావన

ఆరోపితమై దేహభావన పెంపొందటాన్ని ఆధ్యారోపముగా భావింప బడుతుంది. మాయా కల్పితమైన ఉపాధి, లేక దేహము ద్వారా ప్రకృతి యావత్తు పరిచ్ఛిన్నతగా గోచరమవుతుంది. అదే అవిద్య లేక అజ్ఞానము.

రూప పరిచ్ఛిన్నత, నామ పరిచ్ఛిన్నత, క్రియా పరిచ్ఛిన్నత గోచరిస్తోంది. అధ్యాస, పరిచ్ఛిన్నత రెండూ అజ్ఞానానికి సంకేతము. దేహ భావన తొలగాలంటే ఉదాసీనత కలగాలి. అది సంభవమా? ఉదాసీనతకి అవరోధం సంకల్ప వికల్పాలే. వాటిని కూకటి వేళ్లతో పెకిలించాలి. ఎలా? సంకల్పానికి కారణం, లేక ఆధారం, లేక ఆలంబనం ఉంటుంది. కార్యానికి కారణంలాగా సంకల్పవికల్పాలకి ఆధారం దృశ్యం కాబట్టి దానిని తొలగించాలి. నేను నాది అనే ఆవరణ దోషం తొలగాలంటే, సద్గురుమూర్తి బోధాశ్రవణం చేసి, శ్రవణం చేసిన బోధని విచారణ చేయాలి. విచారణ ద్వారా మాయ తొలగుతుంది. దాని ద్వారా నేను నాది అనే దేహభావన రహితం అవుతుంది. సద్గురుమూర్తి బోధా శ్రవణం ద్వారా బుద్ధి ప్రేరణ చెంది శ్రద్ధ కలుగుతుంది. బుద్ధి ప్రేరణ ద్వారా మనస్సు వివేకవంతమైన విచారణ చేస్తుంది. విచారణలో మునిగి వున్న మనస్సు స్థిరపడటానికి తోడ్పడుతుంది. శ్రద్ధ అనేది గురుప్రసాదితమైన క్రియగా భావించాలి. శ్రద్ధ సద్గురుమూర్తి బోధా శ్రవణం ద్వారా మాత్రమే సాధించ గల్గుతాడు. శ్రవణ ప్రక్రియ మూలాజ్ఞాన నిర్మూలనకు ప్రథమ సోపానం


*సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జనవరి 2018, ఫిబ్రవరి 2018 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి

జనవరి 2018: AS 5440, 5441, 5443, 5445, 5446, 6486, 6624, 6626, 6633,
AS 6812, 6824,6990, 6992, 7160, 7173, 7207, 7210, 7273,
AS7207, 7210, 72737419, 7421-7426, 7432, 7434-7436,
AS 7439, 7440, 7441, LM 4106

ఫిబ్రవరి 2018: AS 4473, 6152, 6280, 6421, 7220, 7224, 7225, 7226, 7234,
AS 7236, 7277, 7443, 7444, 7445, 7448

– మేనేజర్

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి)

- సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

శిఖిధ్వజుడిలా అన్నాడు "ఓ మునీశ్వరా! నాకిప్పుడు మనసనేది కూడ లేదని, అర్థము చేసుకొన్నాను. కుంభమునిలా సమాధానము చెప్పాడు "ఈ ప్రపంచము వాస్తవంగా వునికి లేనిది అలాగే మనసుకు కూడ యే కాలంలో, యే ప్రదేశంలో కూడ వాస్తవికత లేదు. అసలు ప్రపంచానికే వునికి లేకపోతే, మనసుకెలా వుంటుంది?

ఈ ప్రపంచము యేకమైన బ్రహ్మ యొక్క సారాంశము. బ్రహ్మము లేకుండ ప్రపంచమనేది లేదు. మనకేది దృశ్యముగా గోచరిస్తున్నదో, అది బ్రహ్మలోనే వున్నది వీచే గాలి యెలా వాయువులో కలిసి పోతుందో, ఆభరణాలను కరిగించి, యెలా బంగారముగా మారుస్తావో, అలాగే ప్రపంచము బ్రహ్మములోనే, లయమవుతుంది. మహర్షి, లేక మహనీయుడు యీ విశ్వాన్ని చూడడు. అతను ఆత్మనే సర్వత్రా దర్శిస్తాడు



ఈ జగత్తు అజ్ఞానులకు మాత్రమే గోచరిస్తుంది. టార్చి లైటు నుండి సుడులు తిరుగుతూ వృత్తాకారంలో వచ్చే మంటలా యీ ప్రపంచము కూడ అవాస్తవమైనది, మనసు అజ్ఞానానికి మరొక పేరు మనసంటే యేమిలేదు. అది అవాస్తవమైన, వాస్తవంగా గోచరిస్తుంది, పునర్జన్మలకు కారణమైన భౌతికమైన కోరిక మనసని పిలువబడుతుంది.

'ఓ రాజా!' బ్రహ్మమునకు పుట్టుక లేదు, ఆద్యంతములు లేవు, నాశ రహితమైనది, శాశ్వతమైనది, అవిభాజ్యమైనది, యెప్పుడు ప్రశాంతంగా వుండి, మహోన్నతమైన శాంతిలో నిరంతరము వసించేది. అట్టి బ్రహ్మతో తాదాత్మ్యత నొందాలి.

శిఖిధ్వజుడిలా అడిగాడు "ఓ కుంభమునీ! జీవన్ముక్తులు యీ లోకంలో యెలా ప్రవర్తిస్తారు? కుంభముని యిలా సమాధానము చెప్పాడు: జీవన్ముక్తులు కోరికలకు, ఆశలకతీతులు, కోరికల నుండి విముక్తులై, వారు మనసులను నిర్మూలం చేసుకొన్నారు. ఇంద్రియాలు సంపూర్తిగా వారి అదుపులో వుంటాయి, వారెన్నో సుగుణాలతో వర్థిల్లుతుంటారు. వారు సవృతము, వొడుదుడుకులు లేని సమదృష్టి, సమతా దృక్పథమును కలిగి యుంటారు. వారికి స్వర్గం కావాలనే కోరికగాని, తమ కర్మ, లేక కృషికి తగ్గ ప్రతిఫలం లభించాలనే ఆశయం కాని వుండదు. వారెలాంటి విపత్కర పరిస్థితులలోనైనా, చలించకుండా, నిబ్బరమైన మనసును కలిగివుంటారు.

శిఖిధ్వజుడిలా ప్రశ్నించాడు :- 'ఓ పూజ్య గురుదేవా! ఒక వస్తువు కదలిక లేనిదై యెలా కదులుతుంది? కుంభమునిలా సమాధానము చెప్పాడు, ఉన్నది వొక్కడే అదే పరబ్రహ్మ, దానికి భిన్నమైనది మరొకటి లేదు, ఇదే సారాంశము. అది సర్వ వ్యాపకము, వర్ణింప శక్యముకానిది, ఊహింపనలవి కానిది, గుణరహితమైనది, ఆత్మ జ్ఞానమును తెలియజేసే సద్గ్రంథములను సుదీర్ఘ పఠనము వలన, సత్సంగము, నిరంతర ధ్యానము వలన ఆత్మసాక్షాత్కారమును పొందగలరు.

ఈ ఆత్మ (నేను) సముద్రములోని నీటివంటిది, సముద్రములోని నీటికి పెద్ద కెరటములనే అలజడి వచ్చినట్లు, 'నేను' తెలివితో అలజడి చెందుతున్నది. అజ్ఞానులు బ్రహ్మను విశ్వం రూపంలో దర్శిస్తున్నారు, బుద్ధియెప్పుడూ తీరిక లేకుండా, చురుగ్గా క్రియా చరణ చేస్తుంటుంది. కాని ఆత్మ (నేను) మాత్రము కదలిక లేనిది. క్రియా రహితమైనది. మేధస్సు (బుద్ధి) వొక స్వల్పమైన కదలిక వలన యీ విశ్వము వుత్పన్న మవుతుంది. అందువల్ల మేధస్సు (బుద్ధి) యీ విశ్వమునకు కదలిక సూత్రంగా రూపొందుతున్నది. ఎప్పుడైతే బుద్ధి పని చేయుటం ఆగిపోతుందో, అప్పుడు దృశ్యమానమైన యీ జగత్తు అదృశ్యమవుతుంది, బ్రహ్మమొక్కటే ప్రకాశిస్తుంది కదలిక లాగిపోతాయి. కదలికలేని, నిశ్చలమైన బ్రహ్మమొక్కటే వునికిగలది, ఓ రాజా! నీవే అమరమైన, నిశ్చలమైన, నిత్యానందమైన బ్రహ్మవు, ఇది తెలుసుకొని చలనరహితమైన శిలలా సమాధిలో వుండిపో".

వెంటనే శిఖిధ్వజుడు స్థిరంగా, చలన రహితమైన విగ్రహంలా కూర్చొండి, నిశ్చలమైన సమాధి స్థితిలో మూడు రోజులు పూర్తిగా వుండిపోయాడు. ఇంతలో కుంభముని తన స్వయం రూపమైన చూడాలగా మారి, తన యోగశక్తితో ఆకాశ యానముచేసి, తన రాజభవనమునకు చేరుకొన్నది, తన భర్త స్థానంలో రాచరిక విధులను చక్కగా నిర్వర్తించి, మూడు రోజుల తర్వాత ఆకాశ యానము చేసి, మరల కుంభముని రూపము ధరించింది, కుంభముని రూపంలో ఆ వనంలోని శిఖిధ్వజుని కుటీరమునకు చేరుకొన్నది.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జనవరి 2018**

1 సోమ - ఆంగ్ల సంవత్సరాది. శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

2 మంగ - పూర్ణిమ ,శ్రీ సద్గురు పాద పూజ

6 శని - శ్రీత్యాగ రాజ స్వామి వారి ఆరాధన.

11 గురు - గురు దశమి, సత్సంగము, శ్రీ సద్గురు పాద పూజ

14 ఆది - భోగి పండుగ, శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపళ్ళుపోయుట.

15 సోమ - సంక్రాంతి; శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన, ఉత్తరాయణ ప్రారంభం. మాస శివ రాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

16 మంగ- కనుమ పండుగ, అమావాస్య.

24 బుధ - రథ సప్తమి

26 శుక్ర - రిపబ్లిక్ డే

27 శని - భీష్మ ఏకాదశి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

31బుధ -గురు మాఘపూర్ణిమ, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

**ఫిబ్రవరి 2018**

10 శని - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

13 మంగ - మహా శివరాత్రి - తె॥జా 3గం.లకు బృందావనంలో శ్రీగురుదేవులకు నమకచమక సహిత అభిషేకం; 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; అనంతరం శ్రీరామలింగేశ్వర స్వామికి సామూహిక ఏకాదశ రుద్రాభిషేకాలు; 11గం.లకు శ్రీరామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం; లక్షబిల్వార్చన; భక్తసమారాధన. సాయంత్రం 6-30ని॥లకు శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.

15 గురు అమావాస్య

18 ఆది : ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి ఆరాధన - సత్సంగం; శ్రీ సద్గురు పాద పూజ

20 మంగ - ఫాల్గుణ శుద్ధ పంచమి -శ్రీ విజయేశ్వరానంద స్వామివారి ఆరాధన - 18 నుండి 20 వరకు సత్సంగ కార్యక్రమములు

## పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'జ్ఞానం వినా మోక్షం న సిద్ధ్యతే' అని హనుమాయమ్మగారు తమ ప్రసంగంలో ప్రస్తావించగానే, సద్గురుదేవులు కలుగజేసుకుని, "ఆ విషయం అప్పుడు పుట్టిన పిల్లాడి తండ్రికి కూడా తెలుసు" అన్నారు. తిరిగి శ్రీవారు మాట్లాడుతూ "జ్ఞానం అంటే ఏమిటి? వీరంతా జ్ఞాన శూన్యులా? వీరంతా చదువుకున్నారు, ఉద్యోగాలు చేస్తున్నారు" అన్నారు. ఆవిడ సమాధానంగా 'అది యదార్థ జ్ఞానం కాదు. వస్తు జ్ఞానం' అన్నారు. గురుదేవులు "వీరికి ముక్తి కావాలంటే, ఏ జ్ఞానం కావాలి?" అన్నారు. హనుమాయ్మగారు 'మోక్షానికి కావలసినది ఆత్మజ్ఞానం' అన్నారు.



శ్రీసద్గురుదేవులు మాట్లాడుతూ "మానవుడు భగవంతుడున్నాడని విశ్వసిస్తాడా? తన జీవిత ధ్యేయం ఏమిటో తనకి తెలుసా? ఇటువంటి వ్యక్తుల కన్నా భగవంతుడు ఉన్నాడని విశ్వసించి, జీవించేవాడు ధన్యుడు కదా! అటువంటి వ్యక్తి దేవాలయ దర్శనం చేస్తాడు. విగ్రహారాధన, పూజలలో పాల్గొంటాడు. అది సాధనలో ప్రథమ సోపానం. దానినే ప్రత్యక్ష జ్ఞానం అనవచ్చు.

క్రమంగా విశ్వాసం పెరిగిన కొద్దీ, పౌరాణిక గ్రంథాలు పఠనం చేయటం, మహాత్ములను దర్శించటం లాంటివి పెంపొందించు కొని వారి బోధా శ్రవణం ద్వారా విశ్వాసం మరింత దృఢమవుతుంది. సాధనలో ఇంకొక మెట్టు పైకి ఎదిగిన స్థితినే పరోక్షజ్ఞానము అనవచ్చు.

భగవంతుడున్నాడనే విశ్వాసం పెరిగినా పరిపూర్ణ అవగాహన వుండదు. సాధకునికి అనేక సంశయాలు కలుగుతాయి. భగవానుని అనుగ్రహంతో ఆ సాధకునికి సద్గురుమూర్తి సమాశ్రయం కలుగుతుంది. సద్గురుమూర్తి సమాశ్రయంతో సగుణారాధనలో వున్న సాధకుడు భగవంతుని నిర్గుణతత్త్వాన్ని గురించి విచారణ చేయడానికి అవకాశం కలుగుతుంది. కోఽహం, కదమిదం? కిం వా కదం? - నేను ఎవరు?, నేను ప్రపంచంలోకి ఎలా వచ్చాను? అనే ప్రశ్నలు ఉద్భవింపజేస్తారు గురుదేవులు. దాని విచారణ ద్వారా తానెవరో తాను గుర్తించ గలుగుతాడు. ఆ స్థితికి చేరిన సాధకుడు జన్మరాహిత్యాన్ని సాధించినట్లే. ఆ స్థితి అపరోక్ష జ్ఞానము.

అక్కడ ద్వైతము లేదు. రాగద్వేషాలు, ఈర్ష్యఅసూయలకు స్థానం లేదు. అది అభేద స్థితి. దానిని సాధించినవాడు ధన్యుడు. 'అద్వేష్టా సర్వభూతానాం' అన్నట్లుగా అందరి యెడల సమభావం కలిగి వుంటాడు. అదే అఖండ భావన. అది సద్గురుమూర్తి అనుగ్రహంతో సాధించ గలుగుతాడు. అదే తత్త్వమేవ కాదు కాదు త్వమేవ తత్. ఏ ధ్యేయం కోసం సాధన చేస్తున్నావో అది తానే అని గుర్తించటం అంటే సిద్ధింప జేసుకోవటం. పొందటం కాదు. పొందేది కాదు. అదే అపరోక్ష జ్ఞానం లేక అపరోక్షానుభూతి" అన్నారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

జనవరి 2018

01 సోమ - : ఆంగ్ల సంవత్సరాది, సాయంత్రం 5గం॥ల30నిలకు. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

02 మంగళ -పూర్ణిమ, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

11 గురు -శ్రీ గురు దశమి, సాయంత్రం5గం॥ల30నిలకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

14 ఆది -భోగి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, శ్రీబాబుకు భోగి పళ్ళు పోయటం, భక్తసమారాధన.

15 సోమ- మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, సాయంత్రం 5గం॥ల30నిలకు, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

20-1-2018 నుండి 26-1-2018 వరకు వార్షిక సత్సంగ సమావేశములు.

22 సోమ - మాఘ శుద్ధ పంచమి - శ్రీ సద్గురు క్షీర శిలామూర్తుల ప్రతిష్ఠా తృతీయ వార్షిక మహోత్సవము. ఉ॥ 6గం. సర్వనామ సంకీర్తన, ఏకాహం. ఉ ॥ 11గం.లకు శ్రీ రమాసత్యనారాయణస్వామి వ్రతము, శ్రీ లలితాష్టోత్తర కుంకుమ పూజల సహితంగా సామూహిక శ్రీసద్గురుపాదపూజలు.

24-1-2018 బుధవారం రథసప్తమి. ఉ॥ 9గం.లకు శ్రీ సూర్యభగవానుని పూజ, ఆదిత్య హృదయం, మన్యుసూక్త పారాయణ.

26-1-2018 శుక్రవారం ఉ॥ 11గం. శ్రీసద్గురుపాదపూజ.

31- బుధ - మాఘపూర్ణిమ. సా॥ 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

ఫిబ్రవరి 2018

10 శని - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

13 మంగ - మహా శివరాత్రి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

శుభాభినందనలతో ...

Grand

RADIATORS

AN ISO 9001:2008 CERTIFIED COMPANY

Manufactures of Radiators (Automobile and Industrial), Oil Coolers, Air Coolers, After Coolers, Inter Coolers, Finned Tube Coolers, Shell and Tube Heat Exchngers,Tube Bundles,Condernsers,Cooling Coils,All Pre-Heaters, Large After Coolers and Mechanically Bonded Radiators









**GRAND RADIATORS**

PLOT NO 131, BLOCK – D, AUTONAGAR,
VISAKHAPATNM -530012.AP, INDIA
TELPHONE: 0891-2517706, 2564538, FAX NO. 0891-2513660, 2502640
E-mail: grandradiator@yahoo.in Website: www.grandradiators.com

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము - 44వ శ్లో॥

గోధూళి ధూసరిత కోమల గోపవేషం
గోపాల బాలక శతై రనుగ మ్యమానమ్
సాయన్తనే ప్రతిగృహం పశుబన్ధనార్థం
గచ్ఛన్త మచుట్టత శిశుం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥

తాత్పర్యము -

ఆవుల కాలి దుమ్ములచే బూడిద రంగుపడి యున్న సొంపైన పసుల కాపరి వేసముగలవాడు, పెక్కునూరుల గొల్లపిల్లకాయలచేత అనుసరింప బడినవాడు, సందెవేళ మేపి, లోపలికి వచ్చిన పశుల కట్టుట కొరకు యింటింటికి వెళ్ళుచున్న బాలుడై యున్న, విష్ణుని గూర్చి యెల్లప్పుడు మ్రొక్కినవాడి నైతిని.



సందెవేళ వ్రజభూమిలో ఒక్క గోపిక యింట్లో వుంటే ఒట్టు! గోప భామినులంతా వీధి గుమ్మంలో వెయ్యి కళ్ళతో కన్నయ్య కోసం ఎదురు చూస్తున్నారు మరి. పగలంతా ఎదురు చూసిన వారి తపస్సంతా పండి బుల్లి కన్నయ్య అడవుల నుంచి ఆవులను మేపి తోలుకు వస్తున్నాడు. ఎవరి గోవులను వారి కొట్టంలోకి తోలి, అక్కడ వాటిని బంధించేందుకు వస్తున్నాడు. గోపెమ్మల ఒళ్ళంతా పరవశించి పోతోంది. అసలే నీడి మబ్బులాంటి ఒళ్ళు. ఆపైన ఆవుల కాలిగిట్టల దుమ్ము పడి బూడిద రంగుగల సొంపైన పశువుల కాపరి వేషం కలవాడు, తమ కన్నుల విందుగా కనిపించబోతున్నాడంటే ఇక వారి ఆనందం వర్ణించతరమా !

వానితో కూడా వచ్చారా గోపబాలురు. కేరింతలు, నవ్వులతో ఆ ప్రదేశమంతా మారు మ్రోగిపోతున్నది. గోపాల బాలక వేషధారియైన ఆ మహావిష్ణువును గురించి తెలుసుకున్న వారి ఆనందం బ్రహ్మానందం!!

# గడ్డపార మింగితే

- పాలూరి కాళీప్రసాద్

**ప॥ గడ్డపార మింగితే నాకలి దీరీనా యీ। వొడ్డినభవము దన్ను వొడకమ్ము గాక॥**

**చ॥ చించుక మిన్నులబారే చింకలను బండిగట్టి । వంచుకొనేమన్న నవి వసమయ్యీనా। యెంచరాని యింద్రియము లెవ్వరికి నేల చిక్కు। పొంచి పొంచి వలపుల బొండబెట్టుగాక॥**

**చ॥ మండమండేయగ్గి దెచ్చి మసిపాత మూటగట్టి । యింటిలోపల దాచుకొన్న నితవయ్యీనా ॥ దంటమమకార మిట్టే తన్నునేల సాగనిచ్చు। బంటుజేసి ఆసలనే పారదోసుగాక॥**

**చ॥ పట్టరాని విషములపాము దెచ్చి తలకింద। బెట్టుకొన్నా నది మందపిలి వుండీనా। వెట్టసంసారమిది వేంకటేశు గొలువని। వట్టి మనుజుల పెడవాడ బెట్టుగాక॥**

ఈ అన్నమయ్య కీర్తనకు నాకు అవగాహన అయినంత వరకు అర్థాన్ని వివరించే ప్రయత్నం చేస్తాను.....

గడ్డపార (గునపం) యొక్క ముఖ్య ఉపయోగం దానితో నేలను త్రవ్వి మొక్కలు నాటుకోగలగటం. కాసిన పండ్లుగానీ, కూరలు గానీ మన ఆకలిని తీరుస్తాయి. అంతేకానీ ఆ గునపాన్ని మ్రింగేస్తే మన ఆకలి తీరదు కదా! అలాగే మన సంసార బంధానికి కారణమైన మనస్సు, ఇంద్రియాలను పరమాత్మవైపుకు మరల్చుకోవాలి. అంతేకానీ సంసారాన్ని వదిలివేస్తానంటే అది మళ్ళీ అంతకంటే తీవ్రంగా మనల్ని కమ్ముకుంటుంది.

స్వేచ్ఛగా ఆకాశంలో తిరిగే చిలకలను తెచ్చి బండికి కట్టి లాగమంటే, అవి లాగకపోగా బండిని కూడా ఆకాశంలోకి ఎగరేసుకు పోవటానికి ప్రయత్నిస్తాయి. అలాగే ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహిస్తే, అవి సమయం కోసం పొంచి వుండి మనలను తీవ్రంగా దెబ్బతీస్తాయి.

మండే అగ్నిని తెచ్చి మసి గుడ్డలో మూటకట్టి ఇంట్లో పెట్టుకుందామంటే అది దాగి వుండకపోగా, ఇల్లంతా తగులపెట్టేస్తుంది. అలాగే మమకారాన్ని బలవంతంగా దాచి వుంచుదామంటే, అది మనలనే బానిసగా చేసుకుని ఆశలలో పడేస్తుంది.

అలాగే విష సర్పాన్ని తెచ్చి దిండుకింద పెట్టుకుని అణిగి

వుండమంటే అది మనలనే కాటువేస్తుంది. అందువల్ల ఈ సంసారాన్ని నిగ్రహించాలంటే మనవల్ల కాదు. అది కేవలం శ్రీ వేంకటేశ్వరుని మీది భక్తితోనే సాధ్యం.

ఇదే విషయాన్ని శ్రీబాబూజీ ఇలా చెప్పేవారు - "ఇంద్రియాలు, మనస్సు స్ప్రింగ్ లాంటివి. బలవంతంగా అణిచిపెట్టాలని చూస్తే, అదను చూసి అంతకంటే బలంగా ఎదురు తిరుగుతాయి. ఈ మనస్సు శరీరము మనకు శత్రువులు కారు. పరమార్థ సాధనకు ఎంతో ఉపయోగ పడే సాధనాలు. (శరీరమాద్యం ఖలు ధర్మ సాధనం). అశాశ్వతమైన క్షణిక సుఖాలకోసం పరుగులు పెట్టే వీటికి, శాశ్వతమైన పరమాత్మ వస్తువు నందు మెల్లమెల్లగా ఆసక్తిని కలిగించాలి. పరమాత్మపై ఒకసారి రుచి మరిగిన తరువాత వాటంతట అవే సంసారాన్ని వదిలివేస్తాయి."

ఇదే విషయాన్ని భగవద్గీతలో గీతాచార్యుడు అనేక పర్యాయాలు చెప్పటం జరిగింది. (ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ........, మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి ...... ఇలా.)

ఇంకా త్యాగరాజ స్వామివారు కూడా "మనసా ఎటులోర్తునే? నా మనవిని చేకొనవే" అని తన మనస్సును బ్రతిమాలుకున్నారు. అలా కాదని పట్టుదలకు పోయి తపస్సు చేసిన విశ్వామిత్ర మహర్షి అనేక పర్యాయాలు తన మనస్సుకు, ఇంద్రియాలకు లొంగిపోయిన చరిత్ర మనకు తెలుసు. అలాగే ఎంతో పట్టుదలతో తపస్సులు చేసిన రాక్షసులు అందరూ తమ తపస్సులు ఫలించగానే మళ్ళీ మనస్సుకు, ఇంద్రియాలకు లొంగిపోయారు.

కనుక మనం ప్రహ్లాదుడు (కంజాక్షునకుగాని కాయంబు కాయమే ....; మందార మకరంద మాధుర్యమునదేలు మధుపంబు బోవునే మదనములకు ....... మొదలైన పద్యముల ద్వారా), కులశేఖరాళ్వారు(జిహ్వే కీర్తయ కేశవం ..... మొదలైన శ్లోకాల ద్వారా) మొదలైన మహా భక్తులు చూపిన బాటలో మెల్లమెల్లగా మన మనస్సును ఇంద్రియాలను పరమాత్మవైపుకు త్రిప్పుకోవాలి.

శుభాభినందనలతో ...


VennTech
Manufacturer of
Ventilation System /
Air Handling Equipments
for Marine applications
PRODUCTS :
Blowers
ATU'S
Coolers
Moisture Separaters
Heat Exchangers
PLOT NO: 1-125/17/A, MIE, HAFEEZPET, MIYAPUR, HYDERABAD – 500 049.
MOBILE: 9000410044, TEL : 040 – 64100589, FAX:040-23116650
E-MAIL: VENNTEC@GMAIL.COM

# సాల్‌బేగ్ భగవద్భక్తి

- రాజీవి

జహంగీర్ పాలనా కాలంలో లాల్‌బేగ్ అనే వ్యక్తి బీహార్ రాష్ట్రంలో సుబేదార్‌గా వుండేవాడు. అతను చాలా క్రూరుడు. రాజుగారి మెప్పు పొందటానికి జగన్నాథ మందిరాన్ని ముట్టడించటానికి పూరీ చేరుతూ దారిలో ముకుందపురం అనే గ్రామంలో ఆగాడు. అక్కడ నడివయస్సులో వున్న ఒక బ్రాహ్మణ విధవరాలు తారసపడింది. ఆమెను బలవంతంగా వివాహమాడాడు. ఆమె వలన ఒక పుత్రుడు కలిగాడు. అతడిపేరు సాల్‌బేగ్.

అతని తల్లి అతనికి భక్తి తత్త్వాన్ని ఉగ్గుపాలతో రంగరించి పట్టింది. అతడు తనుమనోధనాలతో భగవంతుడిని ప్రార్థించేవాడు. అయితే తండ్రి ముస్లిమ్ అవటం చేత క్రమం తప్పకుండా నమాజ్ కూడా చేసేవాడు. కొంతకాలానికి లాల్‌బేగ్ మరణించాడు. సాల్‌బేగ్ రాజుగారివద్ద సైనికుడుగా చేరాడు. ఒకసారి యుద్ధానికి వెళ్ళినప్పుడు తీవ్రంగా గాయ పడ్డాడు. గాయాలు ఎంతకీ మానకపోయేసరికి తల్లి అతని బాధను చూడలేక అతనితో “కుమారా! నువ్వు జగన్నాథ స్వామిని వేడుకో. నీకు ఉపశమనం కలుగుతుంది” అని చెప్పింది.

సాల్‌బేగ్ మనస్సు జగన్నాథ స్వామిపై నిలచిపోయింది. అతడు జగన్నాథుని ప్రతిమను చేసుకుని, రోజూ ఆ ప్రతిమకు స్నానం చేయించడం, అలంకారం చేయటం, నైవేద్యం పెట్టటం, సంకీర్తన చేయటం, నిద్రపుచ్చటం ఇలా నిత్యకృత్యంగా పెట్టుకున్నాడు. ఎల్లవేళలా ‘ఓం నమో భగవతే వాసుదేవాయ’ అనే నామస్మరణ చేసేవాడు.

జగన్నాథ స్వామికి నివేదించి, స్వామి స్వీకరిస్తే కానీ తాను తిననని కూర్చునేవాడు. స్వామి నైవేద్యం స్వీకరించలేదు. ఇలా వారం రోజులు గడిచిపోయాయి. సాల్‌బేగ్‌కి ప్రాణం పోయే స్థితి వచ్చింది. స్వామి కరుణించి వచ్చి నైవేద్యం స్వీకరించాడు.

సాల్‌బేగ్‌ని అర్చకులు ఆలయంలోకి రానిచ్చేవారు కాదు. బయటే నిలబడి స్వామిని దర్శించేవాడు. అతనికి జగన్నాథుడు తప్ప వేరే లోకం లేకపోయింది. రథయాత్ర జరుగుతుంటే స్వామిని దర్శించి ఆనంద భాష్పాలు కార్చేవాడు.

ఒకసారి సాల్‌బేగ్ కృష్ణ దర్శనం కోసం బృందావనం వెళ్ళాడు. అక్కడి నుండి జగన్నాథుడి రథయాత్ర సమయానికి రావాలనుకున్నాడు. కాని అనుకోని కారణాల వల్ల ఆ సమయానికి రాలేకపోయాడు. దారి పొడుగునా ‘అయ్యో! నేను రథయాత్ర చూడలేనే’ అని బాధపడ సాగాడు. కాని ప్రభువు

యొక్క లీల అనంతమైనది! నిష్కళంకుడైన తన భక్తుడికి నిరాశను కలిగిస్తాడా?

అక్కడ పూరీలో జగన్నాధస్వామి రథయాత్ర మొదలైంది. సాల్‌బేగ్ ఇంటివద్దకు వచ్చేసరికి రథం ఆగిపోయింది. రథాన్ని కదిలించడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. జగన్నాథ రథం కూడా మూడు రోజుల వరకు అక్కడి నుండి కదలలేదు. ఇంతలో సాల్‌బేగ్ వచ్చాడు. తన వాకిట్లోనే అతడు స్వామిని దర్శించుకున్నాడు. సాల్‌బేగ్ రాగానే ఆ రథం ముందుకు కదిలింది. సాల్‌బేగ్ విషయం తెలిసికుని ఆనంద పరవశుడయ్యాడు. ఇనుమడించిన భక్తితో అతను శేషజీవితాన్ని జగన్నాధ సేవా స్మరణలతో గడిపి ధన్యుడయ్యాడు!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి గుండు గాయత్రి గారు (ఢిల్లీ నారాయణగారి భార్య) 18-12-2017 సోమవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు.

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.



శ్రీ గంగా భ్రమరాంబ సమేత స్వయంభూః శ్రీరామలింగేశ్వర ఆలయం దిరుసుమర్రులో జరిగిన సామూహిక కుంకుమ మరియు సద్గురు పాద పూజలు

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీ బాబు ఊరి నుండి రావటమూ, దొడ్డి గుమ్మం దగ్గర రిక్షా దిగటమూ, తిన్నగా వంటింట్లోకి రావటమూ, తమ వెనకాల నిల్చోవటమూ, యిదంతా పోపు మీద దృష్టి నిలిపిన సీతమ్మగారికి తెలియనే తెలియదు. "అయ్యో! మీరా బాబూ! తెలియక అలా అరిచాను" అని సీతమ్మగారు అంటుండగానే, శ్రీబాబు గబ గబా తమ గదిలోకి వెళ్ళి పోయారు. సీతమ్మగారు ఆ పొయ్యి, ఆ పోపు అక్కడే వదిలివేసి శ్రీబాబు వెనకే పరుగెత్తుకుంటూ గదిలోకి వెళ్ళారు.



"అయ్యయ్యో! మడికట్టుకున్నవారు వంట పని వదిలేసి యిలా వచ్చారేమిటి?" అన్నారు శ్రీబాబు. "మీరు నన్ను తలపై చెయ్యి పెట్టి ఆశీర్వదించారు కదా!" అన్నారు సీతమ్మగారు. "అరెరే! నా చెయ్యి మీ తలకు తగిలిందా? మీ మడి అంతా మైల పరచేశానే? వెరీ సారీ!" (అని యింగ్లీషులోనే) అన్నారు. సీతమ్మగారు శ్రీబాబు పాదాలు పట్టుకుని "మీ స్పర్శతో నేను పవిత్రతను పొందాను బాబూ" అన్నారు. శ్రీబాబు "సరిగానే గ్రహించావు. ఇక 'వారిని తాకరాదు, వీరిని ముట్ట రాదు' అనే మైల భావం నీలో నుండి తొలగిపోయి, 'సర్వమూ పరమేశ్వర మయమే, సర్వమూ పవిత్రమే' అనే నిజమైన మడి నీవు కట్టుకున్నావు. ఈ మడి ఇక ఎన్నటికీ మైల పడేది కాదు. కాని నీవు అర్థం చేసుకున్నట్లు మిగతా వారందరూ దీనిని అర్థం చేసుకోవటానికి యింకా కొంత కాలం పడుతుంది. ఈ విషయం ఎవరికీ చెప్పకు" అన్నారు. నిజంగానే, అనతి కాలంలోనే యింట్లో వారందరూ కూడ శ్రీబాబు సాక్షాత్ పరమేశ్వరుడే అని గుర్తించి అలాగే నడుచుకున్నారు.

తమ యింటికి వచ్చిన అతిథులను, వీరు వారనే భేదం లేకుండా, కుటుంబ సభ్యులవలె తమ యింటిలో తిరగటానికి, ఉండటానికి తాతయ్యగారు పూర్తిగా స్వేచ్ఛనిస్తూ, తమ యింటిని జగన్మాత దివ్య మందిరం వలె భావించే వారు. ఇక శ్రీ బాబుకు అది స్వగృహమే. వంటింట్లో అమ్మమ్మగారు వంట చేస్తుంటే శ్రీ బాబు వెళ్ళి, వండుతున్న కూరను చేతిలో

వేసుకుని రుచి చూసేవారు. లేదా సగం తినివేసేవారు. “అమ్మమ్మా! నువ్వు పెట్టిన తిరగమూత సువాసన నన్ను యిక్కడికి లాక్కుని వచ్చి “కూరు రుచి చూడు’ అని బలవంతం చేసింది. తినేశాను. మరి యిప్పుడు నైవేద్యం ఎలా?” అనేవారు. “దేవుడే వచ్చి స్వయంగా ఆరగించాక యింకా నైవేద్యం ఎవరికి బాబూ?” అనేవారు అమ్మమ్మగారు. “బాగుందని ఎక్కువ తినేశాను. అందరికి చాలుతుందో లేదో అని భయపడకు. అందరికీ బాగా వడ్డించు. సరిపోతుందిలే” అనేవారు శ్రీబాబు. “మీ చేయి తగిలింది కదా! ఇహ అది అక్షయ పాత్రే బాబూ!” అనేవారు అమ్మమ్మగారు. అదేమి చిత్రమో! ఎంత మందికి వడ్డించినా యింకా మిగిలే ఉండేవి పదార్థాలు. ఒక్కొక్క సారి శ్రీబాబు స్వయంగా వడ్డన చేసేవారు. అది ప్రతి లేని చిత్తోపరతి సుఖాన్ని కలిగించే సుప్రసాదం.

భక్తులందరూ బారులుతీరి భోజనానికి కూర్చొని ఉండగా శ్రీ బాబు అక్కడికి వచ్చారంటే, అందరి మనస్సులు పూర్ణిమ నాటి చంద్రుని చూసి ఉప్పొంగిన సముద్రం వలె ఆనందంలో పొంగిపోయేవి. తినటం మరచిపోయి అందరూ నోళ్ళు తెరుచుకొని ఆయననే చూస్తూ వుండిపోయేవారు. “ఏమిటయ్యా! వెంకటరత్నం? విస్తట్లో వస్తువులన్నీ “నన్ను తిను, నన్నుతిను” అంటూ నిన్ను చూస్తుంటే, నువ్వు వాటిని అలా వదిలి, నన్నే తినేసేటట్లు నా వంక చూస్తావేం? అసలు నీకు ఎలా తినాలో కూడా తెలియదయ్యా! నేను చెబుతాను. ఆ అన్నమంతా ముందుకి లాక్కో. అసలు విస్తట్లో అన్నమేదీ? ‘ఒరే! అన్నమూ! ఇలా రారా’ అని అన్నం వడ్డించే వారిని పిలిచేవారు. అతను వడ్డిస్తుంటే “ఇంకా, ఇంకా వడ్డించు” అని విస్తరి నిండా అన్నం పెట్టించేవారు. “ఒరే! పప్పూ!” అనగానే పప్పు వడ్డించేవారు వచ్చి, శ్రీ బాబుతో చెప్పించుకోక ముందే ఒక అర్థ శేరు పప్పు వడ్డించే వారు. “ఒరేయ్! ఆవగాయా!” అనగానే ఆవకాయ వడ్డించే వారు వచ్చి ఒక పదిహేనో,యిరవయ్యో ముక్కలతో సహా బాగా ఊటతో కలిపిన ఆవకాయ వడ్డించే వారు. “ఒరేయ్! నెయ్యీ! ” అనగానే నేతి జారీ చెంబుతో ఒకరు వచ్చి నెయ్యి వడ్డిస్తుంటే “నీ మొహం! నీకు వడ్డించటం కూడా చేతకాదు” అని ఆ చెంబు లాక్కుని మొత్తం నెయ్యి ఆ అన్నంలో గుమ్మరించే వారు . “ఇహ అవన్నీ బాగా కలుపు, చెబుతాను. ఇంకా బాగా కలపాలి. ఇప్పుడు ఒక ముద్ద తీసుకో. ఏమిటయ్యా? రాచ ఉసిరికాయలాగా అంత చిన్న ముద్ద? ఏదీ? పెద వడ్లపూడి నారింజకాయంత ఉండాలి ముద్ద. ఆ! దానిని నోటికి అందించు! ఇంకో ముద్ద; ఇంకోటి. ఏమిటి! ఎలా ఉంది?” అని అడిగేవారు.

- సశేషం

# విష్ణు  కథలు

-గత సంచిక తరువాయి

## మీరాబాయి

- రమణ ప్రసాద్

మీరా "బాంకే బిహారీ"ని దర్శించాలని బాంకే బిహారీ మందిరంలోకి వెళ్ళబోతుంటే అక్కడ ఆలయానికి అర్చకుడు (జీవ గోస్వామి) "స్త్రీలను చూడను"అనే నియయం పెట్టుకున్నాడు. ఆమె మందిరంలో అడుగు పెట్టేసరికి"అదిగో ఒక స్త్రీ మందిరంలోకి వస్తోంది ఆలయంలో స్త్రీలకు ప్రవేశం లేదు. ఆమెను బయటకు నెట్టండి" అని అక్కడ ఉన్నవాళ్లు గొడవ చేశారు. మీరా అర్చకుడితో "సమస్త బ్రహ్మాండానికి పరమతత్త్వ స్వరూపుడైన గిరిధరుడే పురుషుడు. మిగిలిన ఆత్మలన్నీ ఆ పురుషుడిని ప్రేమించే గోపికలు. ఆ ఆత్మలు ఏవిధంగా నదులు వేగంగా ప్రవహించి సముద్రంలో కలిస్తేగాని శాంతిని పొందనట్లు పరమపురుషునితో ఏకమైతేగాని తరించలేవు కదా! పరమపురుషుడు ఒక్కడే! మరి ఇక్కడ పురుషుడు ఎవ్వరున్నారు?" అని ప్రశ్నించింది. బాగా విచారణ చేస్తే ఇదే మీరా ప్రేమతత్త్వసారం. అర్చకుడు ఆమె ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయాడు. ఆమెకు మందిరప్రవేశం లభించింది.



ఆ తరువాత కొన్ని రోజులకే మీరా బృందావనం విడిచిపెట్టి ద్వారక చేరుకున్నది. యమునా నది సముద్రంలో కలిసినట్లు తాను కూడా గుజరాత్ రాష్ట్రంలో సముద్రంలో కొలువై ఉన్న ద్వారకానాధుని వద్దకు వెళ్ళాలని అనుకున్నది. అక్కడ "రణ్‌ఛోడ్ మందిరం" ఉన్నది. అప్పటికి మేవాడ్‌లో రాజకీయ నైతిక పరివర్తన వచ్చింది. రాజసింహాసనం పైనుండే రాజులు మారారు. రాజా ఉదయసింహుడు (రాణా ప్రతాప్ తండ్రి) సింహాసనం అధిష్టించాడు. తన పూర్వీకులవల్ల మీరా పట్ల ఎన్నో అపరాధాలు జరిగాయి. దానిఫలం కొందరు ఈ జన్మలోనే అనుభవిస్తున్నారు. మీరాకు క్షమాపణలు చెప్పి మేవాడ్‌కు తీసుకురావాలని అనుకున్నాడు. రాజా ఉదయ సింహుడు ఒక వందమంది నమ్మకస్తులైనవారిని మీరాని బ్రతిమాలి మేవాడ్‌కు తీసుకొని రమ్మని పంపాడు. వారు వచ్చేసరికి,మీరా ద్వారకాధీశుని ముందు తన్మయత్వంతో నాట్యం చేస్తూ ద్వారకాధీశుని ఈ విధంగా ప్రార్థిస్తోంది.

మ్హారే జనమ మరణ్ సాథీ, థానే నహి బిసరూ దిన్ రాతీ।
థా దేఖ్యా బిన్ కల్ న పడత్ హై, జాణత్ మేరీ ఛాతీ।
ఊంచీ చఢ్ చఢ్ పంథ్ నిహారూ, రోయ్ రోయ్ అఖియా రాతీ।

యో సంసార్ సకల్ జగ్ ఝూటో, ఝూటీ కులరాన్యాతీ।
దోవు కర్ జోడ్యో అరజ్ కరూ ఛూ, సుణ్‌లీజ్యో మేరోబాతీ।
యో మన్ మేరో బడీ హరామీ, జ్యోమదమాతీ హాథీ।
సత్ గురు హాథ్ ధరయో సిర్ ఊపర్, అంకుశ్ దే సమఝూతీ।
పల్ పల్ పివ్ కీ రూప్ నిహారూ, నిరఖ నిరఖ్ సుఖ్ పాతీ।
మీరా కే ప్రభు గిరిధర్ నాగర్ హరి చరణా దిన్ రాతీ॥

"నా జననమరణాలలో నను వీడని నేస్తమా! నేను నిన్ను రాత్రింబవళ్లు స్మరిస్తాను. నిన్ను ఎన్నటికీ మరువను. నిన్ను చూడకుండా ఒక్కక్షణమైనా ఉండలేను అన్నది నా హృదయానికి తెలుసు. నీకోసం ఎదురుతెన్నులు చూసి చూసి రాత్రంతా ఏడుస్తూనే వున్నాను. ఈ సంసారం, ఈ జగత్తు అంతా మిధ్య . నా వంశీయులు, జ్ఞాతులు అంతా వట్టిదే. నేను రెండు చేతులూ జోడించి నిన్ను వేడుకుంటున్నాను. నా ప్రార్థనను ఆలకించు. నా మనస్సు జిత్తులమారిది. అది ఒక మదించిన ఏనుగువంటిది. సద్గురువు దానిని శిరస్సు మీద అంకుశంతో పొడిచి నియంత్రణలో ఉంచితే కాని మాట వినదు. నా ప్రియుని రూపాన్ని చూస్తూ ఆనందాన్ని పొందుతూనే ఉన్నాను. హరిచరణాలను నాచిత్తమునందు ప్రతిష్టించుకున్నాను."

మేవాడ్ నుంచి రాజా ఉదయసింహుడు పంపగా వచ్చినవారు మీరాతో "తల్లీ! రాజస్థాన్‌లోని కణ కణము మిమ్ము రమ్మని పిలుస్తోంది. మారాజుగారి అభిలాష, అభ్యర్ధన ఇదే! మీరు మేవాడ్‌కి రండి అని అర్ధించారు.

మీరా "నేను ఎవరికోసమైతే ఇక్కడికి వచ్చానో ఆయనను అడుగుతాను ఆయన ఎలా ఆదేశిస్తే అలా జరుగుతుంది. మేవాడ్ నుంచి వచ్చినవారు, "మీరు ఎవరిని అడుగుతారు?" అని అడిగారు. మీరా, "నేను ఎవరికోసం పాడుతున్నానో, ఎవరు నాదైవమో, ఆయననే అడుగుతాను. అని మందిరంలోకి ప్రవేశించింది. అందరూ బయట వేచి వున్నారు. కాని ఆమె బయటకు రాలేదు. ఆమె ఆమూర్తిలో లయమైందని అక్కడి వారు నమ్ముతారు.

1573లో మీరా తనువు చాలించింది అని చెబుతారు.

ఆమెభక్తి పారవశ్యంతో పాడిన పాటలతో జనులకు కృష్ణభక్తిని పంచి పెట్టింది. చివరికి ఆమె శ్రీకృష్ణుని దివ్య చైతన్యంలోనే లీనమై పోయింది.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL